


# విజయభాను




విశాఖపట్నం, శనివారం 21-03-2020 VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 167 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### అపోహలను పోగొట్టి

# అవగాహన కల్పించండి

- సామాజిక దూరాన్ని పాటించాలి
- వదంతులు వ్యాపింపచేస్తే కఠిన చర్యలు
- వైరస్‌ను సాకుగా చూపి ధరలు పెంచొద్దు..
- ఏపీలో కరోనా నిరోధక చర్యలపై వీడియో కాన్ఫరెన్స్
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి



అమరావతి: కరోనా విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజల్లో అపోహలను తొలగించి.. అవగాహన పెంచాలని అధికారులకు ఆయన సూచించారు. కరోనా వ్యాప్తి నిరోధక చర్యలు, ఇళ్ల పట్టాల పంపిణీపై జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులతో సీఎం వైఎస్ జగన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరోనాపై తప్పుడు సమాచారం వ్యాపింప చేసి ప్రజలను ఆందోళనకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. దుకాణాలు అన్ని అందుబాటులో ఉంటాయని.. నిత్యావసర వస్తువులకు ఎట్టి పరిస్థితుల్లోనూ కొరత రాదని సీఎం స్పష్టం చేశారు. కరోనాను సాకుగా చూపించి ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం జగన్ హెచ్చరించారు. నిత్యావసర వస్తువుల ధరలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని.. గ్రామ సచివాలయాల ద్వారా నిత్యావసర వస్తువులపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు.

**మాస్కులను ఎక్కడపడితే అక్కడ పడేయరాదు**

మాస్కులు వాడేవాళ్లు వాటిని సరైన పద్ధతిలో డిస్పోజ్ చేయాలని సీఎం సూచించారు. మాస్కులను ఎక్కడిపడితే అక్కడ పడేస్తే ప్రమాదకరమన్నారు. ఐదు గంటలకు ఒకసారి మాస్కులను మార్చాల్సి ఉంటుందని.. వైద్య సిబ్బంది కచ్చితంగా మాస్కులు తరువాయి 2లో..

### ప్రజలంతా కలసి కట్టుగా సమన్వయంతో

## కరోనా వైరస్‌ను ఎదుర్కోవాలి

- ఆత్మ విశ్వాసంతో ఉండాలి, కరోనాపై విజయం సాధించాలి
- దగ్గు, తమ్ములు, నోటి నుంచి వచ్చే తుంపర్లు ద్వారా వ్యాపిస్తుంది
- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు వెల్లడి



విశాఖపట్నం : ప్రజలంతా కలసికట్టుగా సమన్వయంతో కరోనా వైరస్ ను ఎదుర్కోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం సర్క్యూట్ హౌస్‌లో తరువాయి 2లో..

# న్యాయమే గెలిచింది

- దోషులకు ఉరి అమలు సరైనదే
- దేశ చరిత్రలో ఇది ప్రథమం
- ప్రధాని నరేంద్ర మోదీ
- దేశమంతా హర్షాతిరేకాలు





న్యూఢిల్లీ : నిర్భయ దోషులకు ఉరి శిక్ష పడాలన్న దేశ వ్యాప్త డిమాండ్ ఎట్టకేలకు నెరవేరింది. శుక్రవారం ఉదయం 5 గంటల 30 నిమిషాలకు నలుగురు దోషులను తీహార్ జైలు అధికారులు ఉరి తీశారు. దీనిపై దేశ వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో నిర్భయ దోషుల ఉరిశిక్ష అమలుపై ప్రధాని నరేంద్ర మోదీ ట్విటర్ వేదికగా స్పందించారు. 'చివరికి న్యాయమే గెలిచింది. మన నారీమణులు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. వారికి భద్రతతో పాటు మరింత గౌరవాన్ని పెంచాల్సిన అవసరముంది. అన్ని రంగాల్లో సమానత్వం, అవకాశాల కల్పన ఎంతో ముఖ్యం. మహిళా సాధికారత దిశగా దేశం అడుగులు వేయాలి. దీనికి అందరూ కృషి చేయాలి' అని పేర్కొన్నారు. మరోవైపు నిర్భయ దోషులకు ఉరి అమలుపై కేంద్రమంత్రి స్మృతి ఇరానీ స్పందించారు. ఆలస్యం అయినప్పటికీ దోషులకు శిక్షం పడటం సంతోషకరమన్నారు. తప్పు చేసిన వారికి ఎప్పటికైనా శిక్ష పడుతుందన్నారు.

**దేశ చరిత్రలో ఇదే ప్రథమం?**

నిర్భయ కేసు దోషులు అక్షయ్, పవన్ గుప్తా, వినయ్ శర్మ, ముకేశ్ సింగ్‌లు శుక్రవారం ఉరి తీయబడ్డారు. ఇలా ఒకేసారి నలుగురు వ్యక్తులను ఉరితీయటం దేశ చరిత్రలో ఇదే ప్రథమం. మీరట్ నుంచి వచ్చిన తలారి పవన్ జలాద్ వారిని ఉరితీశారు. జైలు నెంబర్ 3లో అధికారుల సమక్షంలో ఉరిని అమలు తరువాయి 2లో..

# ఎండలు ఎక్కువగా ఉన్నా కరోనా పట్ల అప్రమత్తత అవసరం

- వ్యాధి నియంత్రణపై సీఎంలతో వీడియో కాన్ఫరెన్స్
- ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ : ఎండలు ఎక్కువగా ఉన్నప్పటికీ కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రధాన నరేంద్ర మోదీ తెలిపారు. కరోనా నివారణపై ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కరోనా నియంత్రణ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని సమీక్ష చేపట్టారు. కరోనా నియంత్రణ చర్యలపై సీఎంలతో చర్చించారు. కరోనా కట్టడికి కేంద్రం తీసుకుంటున్న చర్యలను వివరించారు. అలాగే రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేసీఆర్‌లు కూడా పాల్గొన్నారు. నిత్యావసరాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఈ సందర్భంగా ప్రధాని మోదీ ముఖ్యమంత్రులకు సూచించారు.విదేశాల నుంచి వచ్చివారి పట్ల జాగ్రత్తగా ఉండాలని మోదీ తెలిపారు. ఎవరికైనా తరువాయి 2లో..

## కరోనా బాధితులు కోలుకుంటున్నారు

- మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి
- వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ జవహర్ రెడ్డి



అమరావతి : కరోనా వైరస్ బారిన పడిన ప్రకాశం, నెల్లూరుకు చెందిన వ్యక్తులు కోలుకుంటున్నారని వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతుల్ని నమ్మొద్దన్నారు. శుక్రవారం కరోనా వైరస్ నిరోధక చర్యలపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ బులెటిన్ విడుదల తరువాయి 2లో..




## కరోనా వ్యాధిగ్రస్తుడు క్షేమమే..

- మరణించాడన్న వార్త అవాస్తవం
- చికిత్స కొనసాగుతోంది
- నగరంలో ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేశాం
- 115 బృందాలతో ఇంటింటా సర్వే
- విశాఖ కలెక్టర్ వినయ్ చంద్



విశాఖపట్నం : జిల్లా వ్యాప్తంగా కరోనా వైరస్‌కు సంబంధించి అప్రమత్తంగా ఉన్నామని కలెక్టర్ వినయ్ చంద్ తెలిపారు. విశాఖ నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులన్నింటిలో ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విశాఖలో కరోనా పాజిటివ్‌గా తేలిన వ్యక్తి క్షేమంగానే ఉన్నాడని చెప్పారు. ఐసోలేషన్ వార్డులో బాధితుడికి చికిత్స కొనసాగుతోందని వెల్లడించారు. అతను చనిపోయాడనే వార్తలు అవాస్తమని.. తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. విశాఖ నగరంలో క్వారంటైన్ కోసం నాలుగు వేల బెడ్స్‌ని సిద్ధం చేస్తున్నామన్నారు. ఇందులో 500 పైగా బెడ్స్‌ని ఐసోలేషన్ కోసం వినియోగించుకోనున్నట్టు చెప్పారు. విశాఖలో ఒక పాజిటివ్ కేసు నమోదైందని.. ఈ నేపద్యంలో 115 బృందాలతో మరొకసారి కొన్ని ప్రాంతాలలో ఇంటింటి సర్వే చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి నెలాఖరువరకు స్కూళ్లు, కాలేజీలు, సినిమా థియేటర్లు, స్విమ్మింగ్ పూల్స్, తరువాయి 2లో..

## ముందుజాగ్రత్త చర్యలతో వ్యవస్థ రక్షణ

- కరోనాపై కంగారు వద్దు
- తగుజాగ్రత్తలు పాటించండి
- గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్



అమరావతి: ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా కరోనా వైరస్ (కోవిడ్-19)పై యుద్ధాన్ని గెలవవచ్చని రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. ఈ మేరకు వైద్య నిపుణులు సూచించిన జాగ్రత్తలను పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన ఏపీ రాజ్‌భవన్‌లో మాట్లాడుతూ.. ప్రజలు ఇంట్లో ఉండాలని, ప్రయాణాలకు దూరంగా ఉండటం మేలని సూచించారు. జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలు ఉంటే మీ చేతులను తరచూ హ్యాండ్ శానిటైజర్లతో కడగాలని తెలిపారు. ఫేస్ మాస్కులతో ముఖాన్ని కప్పుకోవాలని, చేతితో తాకిన తరువాయి 2లో..

# కరోనా వైరస్ నియంత్రణకు చర్యలు

**నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నంః కరోనా వైరస్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. శుక్రవారం కరోనాపై నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో నాలుగు మండలాల వైద్య అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వ్యాధిపై విశాఖలో మంత్రులు, కలెక్టర్లు, వైద్యాధికారులతో ప్రత్యేక రివ్యూ నిర్వహించారని, అందులో భాగంగా నర్సీపట్నంలో ఈ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటింటికి సర్వే నిర్వహించి దగ్గు, జ్వరం, జలుబు, ఛాతి సంబంధించిన సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. ముఖ్యంగా 60 నుండి 65 సంవత్సరాలు కలిగిన పెద్దలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కరోనా నిర్మూళనకు ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ప్రతీ ఒక్కరూ మాస్కులు, శానిటైజర్స్ వాడాలని కోరారు. విదేశాల నుంచి వచ్చిన వారు ఖచ్చితంగా 14 రోజుల పాటు ఐసోలేషన్ ఉండాలన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డును సందర్శించారు.

అనంతరం డాక్టర్లు, సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ నీలవేణి, మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, వైద్య సిబ్బంది, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



వాంబే కాలనీ కనకాలవీధిలో కరోనా వైరస్‌కు ఉచిత హోమియో మందులు పంపిణీ కార్యక్రమం లో పాల్గొన్న సాయి పూజా ఫౌండేషన్ ఛైర్మన్ మాజీ కార్పొరేటర్ వానపల్లి రవికుమార్, నాగ మణి, వార్డు మాజీ ప్రెసిడెంట్ ధనలక్ష్మి, వార్డ్ సెక్రెటరీ సారిపిల్లి మహేష్, రాజారెడ్డి, అప్పారావు, నాయుడు, శంకర్, మహేష్, యలాజ్జి, వెంకటాద్రి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బాదంతో ఆరోగ్యమే ఆరోగ్యం

విశాఖపట్నం : కాలిఫోర్నియా ఆల్మండ్స్ వారు ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా బాదంతో లడ్డూ, బాదంతో హల్వా ఎలా తయారు చేయాలలో రెసిపీల రూపంలో ప్రజల ముందు ఉంచారు. పంచదార, కుంకుమ, రేకుల నీరు, శెనగపిండి, ఉప్పు, ఆయిల్,యాలికల పొడి తదితర పదార్థాలతో బూందీ లడ్డూ చేసుకోవచ్చని కాలిఫోర్నియా ఆల్మండ్ వారు తెలియజేశారు. ఈ విధంగా చేసుకొని మంచి న్యూట్రిషన్ పదార్థాన్నితినడం వల్ల ఎంతో ఆరోగ్యంగా జీవనం సాగించవచ్చని పేర్కొన్నారు. ఈ బూందీ లడ్డూ ద్వారా2539 కేలరీలు లభిస్తోంది. ప్రోటీన్స్ 45.9,పేట్ 44.7 గ్రాములు, స్ట్రాక్చువల్ పేట్ 5.8 గ్రాములు, కార్బోహైడ్రేట్స్ 499.2 గ్రాములు, ఫైబర్ 23.1, సోడియం 98.4 గ్రాములు,మెగ్నిషియం 363.5 గ్రాములు, విటమిన్ ఈ 14.4, పోటాషియం 1869.5 గ్రాములు, కాల్షియం 236.1 గ్రాములు లభిస్తోంది.

## నూకాలమ్మతల్లి పండగ సందర్భంగా ఊరేగింపు



నర్సీపట్నం : నర్సీపట్నం నూకాలమ్మ తల్లి పండుగ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ధనిమిరెడ్డి నాగు, మాజీ ఆలయ కమిటీ అధ్యక్షులు మార్కెట్ అప్పారావు, ఏకా శివ, దనిమిరెడ్డి ప్రసాద్, రాజేష్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి జాతర మూడో రోజు గరగల ఊరేగింపు నిర్వహించారు. ముందుగా రెల్లి కాలలో ప్రారంభించి ఎస్సీ కాలనీ మీదుగా పాత సంతబయలు, గచ్చపువీధి, కృష్ణాబజార్ నుంచి అబీద్‌సెంటర్ వరకు ఊరేగింపు నిర్వహించారు.

## జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు

గొలుగొండః మండలంలోని పేటమాలపల్లి జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు ఏప్రిల్ 1నుంచి 12వ తేదీ వరకూ నిర్వహించడం జరుగుతుందని కమిటీ సభ్యులు సానా రామకృష్ణ, పులిదారబాబు, ఉర్ల నాగేశ్వరరావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 14న భారతర్న బాబా సహెబ్ డాక్టర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మండల స్థాయి వాలీబాల్ పోటీలు పేటమాలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు నగదు రూపంలో అందించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గనే టీమ్ సభ్యులు ప్రవేశ రుసం రూ.300లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి సమాచారం కొరకు 9000662955, 9618732425, 9494147712 సెల్‌ఫోన్ నెంబర్లు సంప్రదించాలని వారు తెలిపారు.

# సిఆర్పీలకు తీపి కబురు

- క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌ల జీతాల పెంపు
- ఫిబ్రవరి 1 నుంచి వర్తింపు
- ఆనందం వ్యక్తం చేస్తున్న సీఆర్పీలు





దేవరాపల్లి : సమగ్ర శిక్ష అభియాన్ లో పనిచేస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్ లకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారి జీతాలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలకు ముందు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వేతనం పెంచారు. సమగ్ర శిక్షా అభియాన్ లో పనిచేస్తు మండల పరిధిలోని నిర్దేశించిన క్లస్టర్ పాఠశాలలో అభివ ృద్ధి, సంక్షేమ పథకాలు వర్తింపు, సమావేశాల నిర్వహణ, పిల్లలకు యూనిఫాం, ఇతర సామాగ్రిని, పాఠశాలలకు అందజేయడం, నివేదికలు తయారీ తదితర అంశాలపై మండలానికి ముగ్గురు నుంచి ఐదుగురు పనిచేస్తున్నారు. వీరికి ప్రస్తుతం రూ.17755 ఇస్తున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు వీరందరూ రూ. 23500 వేతనాన్ని అందుకోబోతున్నారు. ఫిబ్రవరి ఒకటి నుంచి అమలు : సిఆర్పీలకు పెంచిన వేతనాలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ జిల్లా అధికారులకు అందినట్లు సమాచారం. దీంతో సీఆర్పీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం సిఆర్పీలకు వేతనాలు పెంచడం ఆనందంగా ఉంది. వేతనాలు పెంచాలని గతంలో ఉన్న ప్రభుత్వాన్ని వేడుకున్న పట్టించుకోలేదు. అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే సీఎం మా కష్టాలను గుర్తించారు. ఉద్యోగులంతా సంతోషంగా ఉన్నాం. - వి.వి.రమణ, సిఆర్పి

సీఎంకు రుణపడి ఉంటాం : చాలీచాలని జీతాలతో జీవితాలు నెట్టుకొస్తున్నాం. ఇచ్చే జీతాలు కూడా సరైన సమయానికి అందేవి కావు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి ఎన్నికల ముందు జరిగిన పాదయాత్రలో మా కష్టాలను తెలియజేస్తాం. స్పందించిన ఆయన మాకు మాట ఇచ్చారు. అధికారం చేపట్టిన అనతికాలంలోనే తీపికబురు చెప్పారు. జగనన్నకు సీఆర్పీలు అంతా రుణపడి ఉంటాం. -పి.గంగాధరరావు సిఆర్పి

# భయాందోళనలు వద్దు .. ముందు జాగ్రత్తలే ముద్దు..



శ్రీకాకుళం : కరోనాపై భయాందోళనలు వద్దని, ముందు జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి అన్నారు. శుక్ర వారం జిల్లా కలెక్టర్ లతో రాష్ట్ర ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరోనాపై భయాందోళనలు తొలగించాలని ఆదేశించారు. అవగాహన పెంపొందించి ముందు జాగ్రత్తలు పాటించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. భయాందోళనలతో సరుకులు దొరకవనే అపోహ ఏర్పడుతుందని అన్నారు. నిత్యావసర సరుకులు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయని, ఎటువంటి సమస్య ఉండదని ఆయన స్పష్టం చేసారు. కొరత సృష్టిస్తే కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసారు. సరుకుల ధరలు పెంచరాదని ఆయన అన్నారు. దీనిపై అధికార యంత్రాంగం స్పష్టంగా ఉండాలని ఆదేశించారు. దేశంలో 191 కరోనా కేసులు మాత్రమే నమోదు అయ్యాయని, రాష్ట్రంలో కేవలం 3 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. ఈ కేసులు ఇతర దేశాల నుండి వచ్చిన వారి ద్వారా నమోదయ్యాయని చెప్పారు. ఇటలీ, స్కాట్లాండ్, సౌదీ అరేబియా నుండి వచ్చిన కేసులు అని తెలిపారు. కరోనా నియంత్రణ చర్యల్లో అధికార యంత్రాంగం బాగా పనిచేస్తుందని ప్రశంసించారు. ప్రపంచంలో కూడా 80.90 శాతం ప్రజలకు ఇళ్ల లొనే వైద్య పరీక్షలు జరుగుతున్నాయని గమనించాలని తెలిపారు. నమోదైన కేసుల్లో 13.80 శాతం మాత్రమే ఆసుపత్రికి వెళుతున్న కేసులని, వాటిలో 4.7 శాతం ఐసియు కేసులని ముఖ్య మంత్రి చెప్పారు. ముందుజాగ్రత్తలు చేపడితే సురక్షితంగా ఉండవచ్చని అన్నారు. గ్రామ సచివాలయాల్లో ఆరోగ్య సిబ్బందితో పాటు వాలంటీర్లు ఉన్నారని వారి సేవలు వినియోగించుకుని ప్రజలకు అవగాహన కలిగించాలని అన్నారు. గ్రామ సచివాలయాల్లో కరోనాపై సమాచారం లభ్యంగా ఉండాలని ఆదేశించారు. ఇతర దేశాల నుండి వచ్చిన వారి వివరాలు సేకరించి వారి కదలికలపై నిఘా పెట్టాలని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని చెప్పారు. జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ ఉందని దానిని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ లు పక్కాగా పర్యవేక్షణ చేయాలని, తరచుగా సమావేశాలు నిర్వహించి పరిస్థితిని పర్యవేక్షణ చేయాలని అన్నారు. స్వీయ గృహ నిర్బంధం, సోషల్ డిస్టెన్స్ పాటించాలని పేర్కొన్నారు. బస్సులలో శుభ్రపరచడం జరగాలని అన్నారు. జిల్లా కలెక్టర్ లు ఆసుపత్రులను తనిఖీ చేయాలని, నిర్దేశిత 21 రకాల మందులు అందుబాటులో ఉన్నదీ లేనిది పరిశీలించాలని ఆదేశించారు. నిర్దేశిత పరిమాణంలో బెడ్స్, ఇతర సౌకర్యాలు పరిశీలించాలని అన్నారు. మాస్కుల వినియోగం, విసర్జనపై అవగాహన ఉండాలని అన్నారు. అందరూ మాస్క్ ధరించవలసిన అవసరం లేదని పేర్కొంటూ కరోనా లక్షణాలు ఉన్న వ్యక్తులు, వైద్యం అందిస్తున్న వారు మాస్క్ ధరిస్తే సరిపోతుందని చెప్పారు. మాస్క్ ను 5 గంటల కంటే ఎక్కువ సమయం ధరించరాదని పేర్కొన్నారు. కరోనాపై అవగాహనకు, సమాచారం కోసం కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఘఘఘ.ఎశీష్ట్రటఘ వెబ్సైట్ లో అన్ని వివరాలు చూడవచ్చని చెప్పారు. జలుబు, దగ్గు, జ్వరం సాధారణంగా ఉండవచ్చని, గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉంటే విదేశాల నుండి వచ్చారా లేదా అటువంటివారితో కలిసారా వంటి విషయాలు ఆరా తీయాలని తెలిపారు. అటువంటి వారి సమాచారం తెలిసినవారు 104 కు సమాచారం అందించాలని కోరారు. ప్రజలు అధికంగా గుమిగూడే ప్రదేశాలను మూసివేయడం జరుగుతుందని స్పష్టం చేసారు. ఇది కేవలం ముందు జాగ్రత్త చర్యగా మాత్రమే చేపట్టడం జరుగుతుందని గ్రహించాలని, భయపడాల్సిన అవసరం లేదని వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు అందుబాటులో ఉండాలని అన్నారు. కరోనా 65 సంవత్సరాలు పైబడిన వారు, బిపి, మధుమేహం తదితర రుగ్మతలు ఉండేవారిపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం బాగా ఉండాలని, ఎటువంటి దుష్ప్రభావాలకు ఆస్కారం ఉండరాదని కోరారు. సోడియం హైపోక్లోరైడ్ స్ప్రేయింగ్, బ్లీచింగ్ చేయాలని ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లాలో చేపట్టిన చర్యలపై అభినందనలు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

## అపోహలను పోగొట్టి అవగాహన పెంచాలి

వేసుకోవాలని సీఎం తెలిపారు. 65 ఏళ్లకు పైబడ్డ వయస్సు గలవారికి ఈ వైరస్ గట్టి ప్రభావం చూపుతోందన్నారు. అలాగే యువకులు, చిన్న పిల్లల నుంచి ఈ వైరస్ వృద్ధులకు సోకితే.. ఇబ్బందిపడేది వృద్ధులేనని పేర్కొన్నారు. కిడ్నీ వ్యాధులు, సుగర్‌తో బాధపడేవాళ్లు ఈ వైరస్‌వల్ల తీవ్రంగా ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. అందుకే సోషల్ డిస్టెన్స్ పాటించడం అవసరమని.. దీన్ని అందరూ కూడా గుర్తు పెట్టుకోవాలన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకునే ప్రధాని మోదీ జనతా కర్ఫ్యూకు పిలుపు ఇచ్చినట్టున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటివి ఎక్కువగా చేయాల్సి వస్తుందేమోనని సీఎం అభిప్రాయపడ్డారు.

ఏపీలో కేవలం మూడు కేసులే..

దేశం మొత్తం మీద కేవలం 191 కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. మన ఏపీలో కేవలం మూడు కేసులు మాత్రమే నమోదయ్యాయి. ఈ మూడు కేసులు కూడా విదేశాల నుంచి వచ్చిన వారే.. ఒకరు ఇటలీ, ఒకరు యూకే, ఇంకొకరు సౌదీ నుంచి వచ్చారని సీఎం పేర్కొన్నారు. కరోనా కట్టడికి చర్యలు చేపడుతున్న కలెక్టర్లు, అధికారులు, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు, ఆశా వర్కర్లు, వాలంటీర్లను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రశంసించారు.

ముందు జాగ్రత్త చర్యలు కోసమే..

స్కూళ్లకు సెలవులు ప్రకటించడం, ఇండోర్ అమ్యూజ్‌మెంట్ పార్కులు, థియేటర్లు, మాల్స్ మూసివేయడం, పెద్ద దేవాలయాలు, జిమ్స్, స్విమ్మింగ్ పూల్స్ మూసి వేయాలంటూ.. తీసుకున్న చర్యలన్నీ ముందస్తు జాగ్రత్తల కోసమేనని సీఎం వివరించారు. స్థానిక సంస్థ ఎన్నికలు జరిగి ఉంటే.. వ్యవస్థ మరింత బలోపేతంగా ఉండేది. సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ప్రజల తరపున బాధ్యతగా ఉండే వారు. కాని దురదృష్టవశాత్తూ కొన్ని కారణాల వల్ల జరగలేదు. కాని మనకు గ్రామ వాలంటీర్లు, సచివాలయాల రూపంలో మంచి వ్యవస్థ ఉంది. ఆ వ్యవస్థను వాడుకోవాలి. మీరు నిరంతరం పర్యవేక్షణ ఇస్తూ.. వారిని చైతన్యం చేయాలి. గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ మన బలం. వచ్చే రోజుల్లో ప్రతి విలేజ్ క్లినిక్స్‌ను తీసుకువస్తాం. ఈలోగా మనకున్న సిబ్బందిని సరిగ్గా వాడుకోవాలి. పీహెచ్‌సీల్లో, ఆస్పత్రుల్లో కచ్చితంగా సిబ్బంది ఉండేలా చూసుకోవాలి. హోం ఐసోలేషన్, సోషల్ డిస్టెన్స్ మీద ప్రధాన దృష్టిపెట్టాలని కలెక్టర్లకు సీఎం సూచించారు.

## న్యాయమే గెలిచింది

చేశారు. ఉరి అనంతరం దోషులను పరీక్షించిన వైద్యులు వారు మ ృతి చెందినట్లు తేల్చారు. పోస్టుమార్టం కోసం మ ృతదేహాలు డీడీయూ ఆస్పత్రికి తరలించారు. ఉదయం 8 గంటలకు నాలుగు మ ృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా, 2012 డిసెంబర్ 16 అర్ధరాత్రి ఆరుగురు వ్యక్తులు నిర్భయపై సామూహిక అత్యాచారం చేసిన సంగతి తెలిసిందే. కదులుతున్న బస్సులో ఈ దారుణానికి పాల్పడ్డారు. నిర్భయను అత్యంత క్రూరంగా హింసించారు. ఆమెతో ఉన్న స్నేహితుడిపైనా దాడిచేశారు. తీవ్రగాయాలైన ఇద్దరిని పోలీసులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ నిర్భయ మృతి చెందింది. రామ్‌సింగ్, అక్షయ్, వినయ్ శర్మ, పవన్, ముఖేశ్, మైనర్ అయిన మరో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం రామ్ సింగ్ 2013 మార్చిలో తీహార్ జైల్లో ఆత్మహత్య చేసుకోగా, మరో నిందితుడు మైనర్ కావడంతో మూడేళ్ల శిక్ష తర్వాత అతడు విడుదలయ్యాడు. దాదాపు ఏడేళ్ల తర్వాత నలుగురు దోషులకు ఉరి శిక్ష అమలైంది.

**30 నిమిషాలపాటు ఉరి తీశాం! చివరి కోరిక చెప్పని దోషులు**

ఉరి అమలుకు ముందు నిర్భయ దోషులు చివరి కోరిక చెప్పలేదని తీహార్ జైలు అధికారులు వెల్లడించారు. ఉరికి ముందు దోషులను నిర్భయ కుటుంబ సభ్యులకు చూపించామని జైలు అధికారులు చెప్పారు. ఉరి అమలు నేపథ్యంలో జైలంతా లాక్‌డౌన్‌లో ఉంచామని, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. ఇక కారాగార సమయంలో పవన్, వినయ్, ముఖేష్ జైల్లో పనిచేశారని, వారు సంపాదించిన మొత్తం ఆయా కుంటుంబాలకు అందిస్తామని జైలు అధికారులు చెప్పారు. దోషులు రాత్రంతా నిద్ర లేకుండా గడిపారని తెలిపారు. ఉరి తీసే గంట ముందు బ్రేక్ ఫాస్ట్‌కు నిరాకరించారని పేర్కొన్నారు. కాగా, నిర్భయ దోషులు ముఖేష్ సింగ్ (32), పవన్ గుప్తా (25), వినయ్ శర్మ (26), అక్షయ్ కుమార్ సింగ్ (31)ను శుక్రవారం ఉదయం 5:30 గంటలకు తీహార్ సెంట్రల్ జైలులోని జైలు నెంబర్ 3లో ఉరితీసిన సంగతి తెలిసిందే.

## ప్రజలంతా కలసి కట్టుగా సమన్వయంతో కరోనా వైరస్‌ను ఎదుర్కోవాలి

కరోనా వైరస్ (కోవిడ్ -19) పై ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి కరోనా వైరస్ పై ప్రజలకు తమ సందేశాలను తెలిపినట్లు ఆయన చెప్పారు. విద్య, వ్యాపార, పారిశ్రామిక సంస్థలు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలన్నారు. ప్రజలంతా ఆత్మ విశ్వాసంతో ఉండి, కరోనాపై విజయం సాధించాలన్నారు. ప్రజలందరూ సమన్వయంతో కలసికట్టుగా కరోనాను ఎదుర్కోవాలని, భయపడొద్దు, జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కరోనా వైరస్ గాలి ద్వారా ఒకరి నుండి మరొకరికి వ్యాపించదని, తుమ్ములు, దగ్గినా, నోటి నుండి వచ్చే తుంపర్ల ద్వారా వ్యాపిస్తుందని ఆయన వివరించారు. ప్రతి సారి శానిటైజర్‌తో చేతులు కడుగుకోవాలన్నారు. అత్యవసర సమయంలో తప్ప దూర ప్రాంతాలకు ప్రయాణించరాదని చెప్పారు. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, స్క్రీనింగ్ కేంద్రాలు ఉండాలన్నారు. ఆ పేషెంటును చూసే డాక్టర్ క్వారంటైన్ లో ఉన్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వ్యాపార సంస్థల యాజమాన్యం నుండి మావూరి వెంకటరమణ మాట్లాడుతూ ఎక్కువ రద్దీ ఉన్న ప్రాంతాలను మూసివేసినట్లు చెప్పారు. పాప్స్‌లలో శానిటైజేషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కరోనా నివారణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. వైజాగ్ చాంబర్ ఆఫ్ కామర్స్ నుండి మల్లిక్ మాట్లాడుతూ వ్యాపార సంస్థల్లో ఉన్న సమయాన్ని తగ్గిస్తున్నట్లు చెప్పారు. సి.ఐ.ఐ. అధ్యక్షులు శ్రీనివాసరాజు మాట్లాడుతూ వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులను దూరం దూరంగా ఉంచుతున్నట్లు చెప్పారు. కరోనా వైరస్ నివారణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు.

## ఎండలు ఎక్కువగా ఉన్నా కరోనా పట్ల అప్రమత్తత అవసరం

కరోనా లక్షణాలు ఉంటే వెంటనే క్వారంటైన్‌కు తరలించాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉంటే వైరస్ వ్యాపించదని తొలుత భావించాం.. కానీ గల్ఫ్ దేశాల్లో ఎండలు ఎక్కువగా ఉన్నా కూడా కరోనా వ్యాపించిందని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నప్పటికీ కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

## ముందుజాగ్రత్త చర్యలతో వ్యవస్థ రక్షణ

ఉపరితలాలను శుభ్రపరచాలని పేర్కొన్నారు. సామాజిక దూరాన్ని కొనసాగించండి, పది మందికి పైగా గుమికూడకుండా ఉండండి. ఇంట్లో వృద్ధులను జాగ్రత్తగా చూసుకోండి. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. ఏదైనా లక్షణాలు కనిపిస్తే, కాల్ సెంటర్‌ను సంప్రదించండి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లోని వైద్యులను సంప్రదించి, వెంటనే వారి సలహాను పాటించండి. పరిస్థితి సాధారణం అయ్యే వరకు మతపరమైన ప్రదేశాలను సందర్శించకుండా ఉండండి. సూచనలు పాటిస్తే మనల్ని, మన కుటుంబాలను, సమాజాన్ని, దేశాన్ని రక్షించుకోవచ్చు అని బిశ్వభూషణ్ హరిచంద్రన్ తెలిపారు.

## కరోనా వ్యాధిగ్రస్తుడు క్షేమమే..

మాల్స్ మూసివేశామన్నారు. కరోనాపై ఎవరూ భయాందోళనలు చెందవద్దని.. కరోనాపై ప్రజలకి అవగాహన కల్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు.

విద్యార్థులు ఇంటి వద్దే ఉండాలి : ఏయూ రిజిస్ట్రార్

కరోనా దృష్ట్యా ఆంధ్రా యూనివర్సిటీ, దాని అనుబంధ కళాశాలలు, హాస్టళ్లు మూతపడ్డాయి. హాస్టళ్లను ఖాళీ చేయించిన అధికారులు 9 వేల మందికి పైగా విద్యార్థులను, పరిశోధకులను స్వస్థలాలకు తరలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు యూజీసీ ఆదేశాల ప్రకారం మార్చి 31వరకు విద్యార్థులతోపాటు, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు సెలవు ప్రకటిస్తున్నట్టు రిజిస్ట్రార్ కృష్ణమోహన్ తెలిపారు. మార్చిలో యూనివర్సిటీ పరిధిలో జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేసినట్టు స్పష్టం చేశారు. మార్చి 31 తర్వాత సమీక్ష అనంతరం తదుపరి కార్యచరణ ప్రకటిస్తామన్నారు. స్వస్థలాలకు వెళ్లిన విద్యార్థులు బయట తిరగకుండా ఇంటి వద్దే ఉండాలని సూచించారు.

## కరోనా బాధితులు కోలుకుంటున్నారు

చేసింది. ఆ బులెటిన్‌లో.. విశాఖపట్నంలో ఒక కరోనా వైరస్ పాజిటివ్ కేసు నమోదయ్యింది. వార్తల విషయంలో మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. విదేశాల నుండి ఏపీకి తిరిగి వచ్చిన వారందరికీ స్వీయ గృహ నిర్బంధ నోటీసులు ఇచ్చాము. అతిక్రమిస్తే 'ఏపీ ఎపిడమిక్ డిసీజ్ కొవిడ్-19, 2020 ఐపీసీ సెక్షన్ 188' ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. కరోనా వైరస్ నియంత్రణకు యుద్ధప్రాతిపదికన చర్యలు మొదలుపెట్టాం. వైరస్ అనుమానితుల సమాచారాన్ని కంట్రోల్ రూం నెంబరు ( 0866-2410978)కి తెలియజేయాలి. పూర్తి అప్రమత్తంగా ఉన్నాం. కరోనా వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే సమీప ప్రభుత్వాసుపత్రిని సంప్రదించాలి. వైద్య సలహాల కోసం 104 టోల్ ఫ్రీ హెల్ప్ లైన్‌కు ఫోన్ చేయాలి. కరోనా ప్రభావిత దేశాల నుండి రాష్ట్రానికొచ్చిన 966 మంది ప్రయాణికుల్ని గుర్తించాం. 677 మంది ఇళ్లలోనే వైద్యుల పరిశీలనలో ఉన్నారు. 258 మందికి 28 రోజుల పరిశీలన పూర్తయ్యింది. 31 మంది ఆసుపత్రిలో వైద్యుల పరిశీలనలో ఉన్నారు. 119 మంది నమూనాలను ల్యాబ్‌కు పంపగా 104 మందికి నెగిటివ్ వచ్చింది. 12 మంది శాంపిళ్లకు సంబంధించిన రిపోర్టులు రావాల్సి ఉంది.ప్రతి జిల్లాలోని బోధన, జిల్లా ఆసుపత్రుల్లో ఐసోలేషన్ వార్డుల్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

# కరోనా నివారణ కోరుతూ సంపూర్ణ గీతా పారాయణ



విశాఖ సిటీః వన్ టౌన్ రాజప్ప నాయుడు వీధి శ్రీ గీతా భవన్‌లో శ్రీ గీతా ప్రచార సమితి వారి ఆధ్వర్యంలో కరోనా వైరస్ పూర్తిగా నశించి పోవాలని కోరుతూ సామూహికంగా సంపూర్ణ గీతా పారాయణం నిర్వహించినట్లు శ్రీ గీతా ప్రచార సమితి సంస్థ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా విఘ్నేశ్వర పూజను నిర్వహించి తదుపరి గోసమేత శ్రీకృష్ణ ఉత్సవ మూర్తికి అభిషేకములు, ప్రత్యేక పూజలు, సహస్ర నామములతో పుష్పార్చన నిర్వహించారు. అనంతరం శ్రీ గీతా ప్రచార సమితి సభ్యులు మరియు భక్తులు సామూహికంగా ముక్తకంఠంతో భగవద్గీతలో గల 702 శ్లోకాలను పారాయణం చేసి కరోనా వైరస్ నశించిపోవాలని శ్రీ కృష్ణార్జున సహిత విశ్వరూప భగవానునికి భక్తి శ్రద్ధలతో ప్రార్ధన చేసినట్లు తెలిపారు. పారాయణం అనంతరం దూప, దీప, నైవేధ్యములు మంత్ర పుష్పములు స్వామి వారికి సమర్పించి విచ్చేసినవారందరికి తీర్ధ ప్రసాదములు వితరణ చేశారు.

ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు వై.కృష్ణమూర్తి, అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు, సంస్థ ప్రధాన కార్యదర్శి పి. జగన్మోహన్‌రావు, సంస్థ పిఆర్ఓ ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, కార్యదర్శి ఎం.వనజాదేవి, కోశాధికారి జి.వి.ఆర్. ప్రసాద్, శ్రీ గీతా ప్రచార సమితి సభ్యులు నగరానికి చెందిన పలు ఆధ్యాత్మిక సంస్థ ప్రతినిధులు అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా మరుగుదొడ్లుకు ఉచితంగా శానిటైజర్ లిక్విడ్ పంపిణీ




సింహాచలం : 98 వ వార్డు పరిధి సింహాచలంలో ప్రజా మరుగుదొడ్లు భక్తులుతో పాటు స్థానికులు కూడా ఉపయోగించుకుంటారు.

5 రూపాయలు ఇచ్చిన తరువాత మాత్రమే మరుగుదొడ్డి లోపలికి ప్రవేశం ఉంటుంది కాబట్టి టికెట్ కొనే ప్రతి వ్యక్తి వినియోగదారుడే సింహాచలంలో మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటం వలన ఆరోగ్య రక్షణ మానవ హక్కుగా భావించి కరోనా వ్యాప్తి నేపథ్యంలో రోగం ప్రబలకుండా ఉండేవిధంగా ప్రజా మరుగుదొడ్లులో బ్లీచింగ్ ఫినాయిల్ యాసిడ్ తప్పనిసరి ఉండేటట్లుగా అలాగే మలమూత్రవిసర్జజ చేసిన తరువాత చేతులు శుభ్రపరచుకొనేవిధంగా జీవియంసీ అధికారులు శానిటైజర్ లిక్విడ్ ఉండేటట్లు గా చర్యలు తీసుకోవలసినదిగా కోరుతూ ఈ కరోనా వైరస్ సమిష్టి కృషితోనే అరికట్టడం సాధ్యం అందువలన ఎవరికీ వారు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి భోజనంకు ముందు మలమూత్ర విసర్జన తరువాత చేతులు శుభ్రపరుచుకోవాలని సూచనలు ఇస్తూ వినియోగదారుల హక్కుల సంస్థ చినగదిలి అధ్యక్షుడు విజినిగిరి బాలభానుమూర్తి ఆద్వర్యంలో సింహాచలంలో ఉన్నటువంటి మూడు ప్రజా మరుగుదొడ్లుకు శానిటైజర్ లిక్విడ్ ఫినాయిల్, ఉచితంగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా సిటీ సిఆర్ఓ కార్యాదర్శి లోగిశ.గణేష్ మజ్జి.ధర్మరాజు కర్రి.రమణ పాల్గొన్నారు.

# కరోనా వైపరీత్యాన్ని అధిగమించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

విశాఖ సిటీ : ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ బాధితుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. విశాఖనగరంలో కూడా కరోనా కేసులు నమోదు అవ్వడం విశాఖ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. కరోనాని అధిగమించేందుకు ఇప్పటికే అనేక జాగ్రత్తలు పాటించమని ప్రభుత్వం చెప్తోంది. వీటితో పాటు విద్యాసంస్థలు మాల్స్, సినిమాహాల్స్, హొటల్స్ మెదలగు వర్తక, వాణిజ్య, వ్యాపార సంస్థలన్నింటిని మూసివేయాలని పిలుపునిచ్చింది. దీనివలన పేద ప్రజలు, రోజువారి పనులు చేసుకుంటున్న అసంఘటితరంగంలో ఉన్న కార్మికులకు తిండి కూడా దొరకని పరిస్థితి ఏర్పడుతుంది.

కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటితరంగంలో పనిచేస్తున్న కార్మిక కుటుంబాలన్నింటికి నిత్యావసరసరుకులు, రేషన్ ఉచితంగా సరఫరా చేయాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తున్నది. ఇప్పటికే కేరళ రాష్ట్ర ప్రభుత్వం 20 వేల కోట్ల రూపాయలు ప్రత్యేక నిధిని కేటాయించి ప్రజలకు అవసరమైన సరుకులు పంపిణీ చేస్తుంది. కేరళ తరహాలో అన్ని రాష్ట్రాలు ప్రజల అవసరాలు తీర్చేందుకు తగినన్ని నిధులు కేటాయించి ఆందుకోవాలని సిపిఎం పార్టీ కోరుతుంది.

# తృటిలో తప్పిన ప్రమాదం

## కారును డీ కొన్న ఆర్ .టి.సి బస్సు



కంచరపాలెం : పంజాబ్ హోటల్ కూడలి జాతీయ రహదారి పై శుక్రవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో కారును డీ కొన్న ఆర్ .టి.సి బస్సు డీ కొంది. ప్రమాదానికి సంబందించి కంచరపాలెం ట్రాఫిక్ పోలీసు లు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. ఎన్ .ఏడీ కూడలి నుండి బిర్లా కూడలి జాతీయ రహదారి పై వెళ్తున్న కారు పంజాబ్ హోటల్ కూడలి వద్ద సిగ్నల్ పాయింట్ మలుపు వద్ద వాహనాలు అధిగమించే సమయంలో కారు డ్రైవర్ ఒక్క సారిగా బ్రేక్ వేయడంతో గజువాక నుండి ఎన్ .ఏడీ కూడలి మేదుగా వస్తున్న ఆర్ .టి.సి బస్సు కారు వెనుక భాగాన్ని బలంగా డీ కొంది ఈక్రమంలో ముందు వెళ్తున్న కారు మరో కారును డీ కొంది ప్రమాదంలో ప్రాణ నష్టం లేకపోవటంతో అంత ఊపిరి పిల్చుకున్నారు. ప్రమాదంలో కారు ముందు బాగం పాక్షికంగ దెబ్బ తినగా వెనుక బాగం నుజ్జయ్యింది.

ప్రమాద విశయం తెలుసుకున్న కంచరపాలెం ట్రాఫిక్ పోలీసు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితి సమీక్షించారు.

# కరోనా వైరస్ వ్యాప్తిచెందకుండా నివారిద్దాం

## వైసీపీ నేత తిప్పల వంశీ రెడ్డి



గాజువాక : నియోజకవర్గంలోని జీవీఎంసి 74వ వార్డు పరిధి పెదగంట్యాడ మండలం పెద్దకోరాడ గ్రామంలో వైసిపి నేత తిప్పల వంశీరెడ్డి శుక్రవారం పర్యటించారు. గ్రామంలో గడప గడపకీ వెళ్లి గ్రామంలో ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా నిరోధించాలని, పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని పిల్లలు, పెద్దలు బయటకు రాకుండా ఇళ్ళలోనే ఉండాలని సూచించారు. ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా ఆంధ్రలో వ్యాప్తి చెందకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు అని అన్నారు. ముఖ్యంగా ప్రపంచాన్నే గడగడలాడిస్తున్న కరోనా వైరస్ నుండి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరోనా వైరస్ సోకకుండా రోగనిరోధక శక్తిని పెంచే ఆహారం తినాలని, కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వాక అప్పలరాజు, శిరపు కుంచారవు, పులి తమ్మి రెడ్డి. పులి అప్పలరెడ్డి, వెంపడ ప్రసాద్, శిరపు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేడుకలను వాయిదా వేసుకోండి

## ఎయిర్ పోర్ట్ ఎస్. ఐ మహేశ్వరావు



విశాఖపట్నం : ప్రస్తుతం విశాఖలో కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలు నిర్వహిస్తున్న వేడుకలను స్వచందంగా వాయిదా వేసుకోవాలని ఎయిర్ పోర్ట్ ఎస్ .ఐ మహేశ్వరావు విజ్ఞ్యప్తి చేసారు. ఈమేరకు జీవీఎంసీ 53 వ వార్డు పరిది మర్రిపాలెం మస్జిద్ వీధి లో శుక్రవారం నిర్వహిస్తున్న హజ్రత్ ఖాదర్ వలి ,హజ్రత్ మౌలాలీ చందనోత్సవ వేడుకలను నిలిపి వేయాలని ఉర్స్ కమిటీ సభ్యులకు సూచించారు. విశాఖలో మొదటి కరోనా కేసు నమోదు అయిందని గుర్తు చేసిన ఆయన ఎక్కడికక్కడ ప్రజలు గుంపులుగా తిరగరాదన్నారు . అత్యవసర పరిస్తితుల్లో తప్పయితే ఇంటినుండి బయటకు వెళ్లరాదని ముఖ్యంగా వ్యాది బారిన పడకుండా ఉండేందుకు మాస్కులు ధరించుకోవాలని కోరారు. ప్రజలు ప్రభుత్వ సూచనలు పటిస్తూ పోలీసు వారికి సహకరించాలని తెలియజేసారు.

# సుగమ్య భారత అభియాన్ సమావేశము



విశాఖపట్నం : సుగమ్య భారత అభియాన్ పథకం క్రింద ప్రభుత్వ భవనాలను దివ్యాంగులకు అనుకూలంగా మలిచే పనులకు సంబంధించి జాయింట్ కలక్టరు ఎల్. శివశంకర్ కలక్టరు కార్యాలయంలో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 38 కార్యాలయములకు సంబంధించిన పనులు విషయమై ప్రతి పని వారీగా ఇప్పటివరకు సాధించిన ప్రగతి, ప్రస్తుత స్థితి అధికారులను అడిగి తెలుసుకున్నారు. 38 ప్రభుత్వ భవనాలల్లో వున్న నిర్మాణ పరిస్థితులను దివ్యాంగులకు అనుకూలంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.1456.34 కోట్లు ఇప్పటికే విడుదల చేసియున్నందున ఈ పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులో ఎటువంటి ఇబ్బందులు ఉండవు కాబట్టి కార్య నిర్వాహక అధికారులు త్వరితగతిన పనులు ప్రారంభించి తగిన సమయంలో పూర్తి చేయాలని జాయింట్ కలక్టర్ ఎల్. శివశంకర్ ఆదేశించారు.

పనుల ప్రగతి విషయంలో పురోగతి సాధించిన జి.వి.ఎం.సి మినహా మిగిలిన ఏజన్సీల విషయంలో జాయింట్ కలక్టరు అసంతృప్తి వ్యక్తం చేశారు. దివ్యాంగుల కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను సత్వరమే సద్వినియోగం చేయాలని ఈ విషయమై ప్రతి 15 రోజులకు ఒక సారి సమీక్షా సమావేశం నిర్వహించబడుతుందని జాయింట్ కలక్టర్ తెలియిజేశారు.

ఈ సమీక్షా సమావేశానికి ఇంజనీరింగ్ అధికారులు మరియు దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు శ్రీ పి. వెంకటేశ్వరరావు హాజరయ్యారు.

**జాతీయ ట్రస్టు కమిటీ సమావేశము :**

జాతీయ ట్రస్టు చట్టం క్రింద ఏర్పాటు చేయబడిన జిల్లా స్థానిక స్థాయి కమిటీ సమావేశము జాయింట్ కలక్టరు ఎల్. శివశంకర్ అధ్యక్షతన కలక్టరు కార్యాలయంలో జరిగింది.

18 సంలు నిండిన మానసిక వికలాంగులు, సెరిబ్రల్ పాల్సీ మరియు ఆటిజం బాధితులు కోసం వారి తల్లిదండ్రులకు గార్డియన్‌షిప్ మంజూరు విషయమై సమావేశంలో చర్చించబడినది. గార్డియన్లిప్ కొరకు ఆన్లైన్ ద్వారా వచ్చిన ధరఖాస్తుల పరిశీలించిన పిమ్మట 26 ధరఖాస్తులను ఆమోదించి ఆయా సంరక్షకులకు గార్డియన్షిప్ పత్రాలు మంజూరు చేసే విషయమై స్థానిక స్థాయి కమిటీ అధ్యక్షులైన జిల్లా కలక్టరుకు సిఫారసు చేయుటకు సమావేశంలో జాయింట్ కలక్టర్ ఎల్. శివశంకర్ ఆమోదం తెలిపారు. ఆదే విధంగా నిరామయ బీమా పథకం దివ్యాంగులకు ఉపయోగపడే విధంగా తీసుకోవలసిన చర్యలపై కూడా చర్చించి ఈ విషయంలో కన్వర్జెన్స్ సమావేశం ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకోవడమైనది.

ఈ సమావేశములో ఆశాదీప్ పేరెంట్స్ అసోషియేషన్ అధ్యక్షులు పి.ఎమ్.కె. రావు, దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పి. వెంకటేశ్వరరావు తదితర సభ్యులు హాజరయ్యారు.

# గిరిజన యువత ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

## జిల్లా ఎస్.పి., బాబూజీ అట్టాడ



విశాఖపట్నంః ప్రేరణ కార్యక్రమం ద్వారా ఏజెన్సీ మారుమూల ప్రాంతాలైన జి.మాడుగుల, హుకుంపేట, ముంచింగిపుట్టు, పెదబయిలు మరియు పాణిరు మండలాలకు చెందిన 26 మంది గిరిజన యువత స్వయం ఉపాధి పొందేందుకు మ్యానుఫ్యాక్చరింగ్ అసిస్టెంట్ కోర్సు శిక్షణను స్కిల్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్, రెడ్డిపల్లి గ్రామం, పద్మనాభం మండలం, విశాఖపట్నం జిల్లా లో శిక్షణ పూర్తి చేసుకొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న గిరిజన యువతతో స్కిల్ డెవలప్మెంట్ ఇన్సిట్యూట్‌లో ఇన్స్పెక్టర్ ఏ.వెంకటరావు మాట్లాడుతూ ఏజన్సీ ప్రాంతంలో తెలివితేటలు ఉండి వృత్తి నైపుణ్యం లేక ఉపాధి అవకాశాలు అందిపుచ్చు కోలేకపోతున్నారన్నారు. 10వ తరగతి, ఇంటర్ చదువుకున్న యువత నిర్వీర్యం కాకూడదనే ఉద్దేశంతోనే జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడ ఐపీఎస్ గారు కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా వృత్తినైపుణ్య శిక్షణ ఇవ్వడమే కాకుండా అందరికీ హైదరాబాదు జీడిమెట్లలోని హెట్రో కంపెనీలో సుమారుగా రూ.12,000/- జీతంతో ఉద్యోగాలు కల్పించారు. శిశణ పొందిన గిరిజన యువత మాట్లాడుతూ జిల్లా పోలీసులు మమ్మల్ని తీసుకొనివచ్చి 35 రోజుల పాటు శిక్షణ ఇప్పించి ఉద్యోగం ఇప్పించడం ఎంతో ఆనందకరమైన విషయమని, అందుకు ఎస్పీ గారికి మరియు జిల్లా పోలీసు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ పోలీస్ ఇన్స్పెక్టర్ ఎన్.సాయి, ఎస్.ఐ రామకృష్ణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వేడుకలను వాయిదా వేసుకోండి

## ఎయిర్ పోర్ట్ ఎస్ .ఐ మహేశ్వరావు ...

విశాఖపట్నం : ప్రస్తుతం విశాఖలో కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలు నిర్వహిస్తున్న వేడుకలను స్వచందంగా వాయిదా వేసుకోవాలని ఎయిర్ పోర్ట్ ఎస్ .ఐ మహేశ్వరావు విజ్ఞ్యప్తి చేసారు. ఈమేరకు జీవీఎంసీ 53 వ వార్డు పరిది మర్రిపాలెం మస్జిద్ వీధి లో శుక్రవారం నిర్వహిస్తున్న హజ్రత్ ఖాదర్ వలి ,హజ్రత్ మౌలాలీ చందనోత్సవ వేడుకలను నిలిపి వేయాలని ఉర్స్ కమిటీ సభ్యులకు సూచించారు.

విశాఖలో మొదటి కరోనా కేసు నమోదు అయిందని గుర్తు చేసిన ఆయన ఎక్కడికక్కడ ప్రజలు గుంపు లుగా తిరగరాదన్నారు. అత్యవసర పరిస్తితుల్లో తప్పయితే ఇంటినుండి బయటకు వెళ్లరాదని ముఖ్యంగా వ్యాది బారిన పడకుండా ఉండేందుకు మాస్కులు ధరించుకోవాలని కోరారు.

ప్రజలు ప్రభుత్వ సూచనలు పటిస్తూ పోలీసు వారికి సహకరించాలని తెలియజేసారు.



*ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి మాలాదారణ భక్తులు ఆద్వర్యంలో శుక్రవారం ఘటాలు, శూలాలతో పట్టణ పురవీధుల్లో అమ్మవారిని ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపుకార్యక్రమాన్ని శతకంపట్టు కనకదుర్గమ్మ అమ్మవారిఆలయ చైర్మన్ దాడి జయవీర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొణతాల భాస్కరరావు, పి.వి. రమణ, కాండ్రేగుల నాయుడు, కొణతాల వాసు, మాలాధారణ భక్తులు తదితరులు పాల్గొన్నారు.*

# విశాఖలో కరోనా నిర్ధారణ పరికరం ఏర్పాటు చేయాలి

## ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలి .. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

విశాఖపట్నంః గత మూడు నెలలుగా ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా వైరస్ వ్యాధి నిర్ధారణ పరికరం (ఆర్‌టిపిసిఆర్) విశాఖలో నేటికీ ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇలాంటి సమయంలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టవలసిన అధికార యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమని, యుద్ధప్రాతిపదికన విశాఖలో వ్యాధి నిర్ధారణ పరికరం (ఆర్‌టిపిసిఆర్) ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పత్రిక ప్రకనటల్లో తెలిపారు. రాష్ట్రంలోనే ఆర్థిక రాజధానిగా పేరుగాంచిన, ప్రపంచ స్థాయిని ఆకర్షిస్తున్న విశాఖలో ఈ పరికరం ఏర్పాటు చేయకపోవడంపై విచారకరం. ఇక్కడ అంతర్జాతీయ విమానాశ్రయం ఉండడంతో దేశ, విదేశాల నుంచి రాకపోకలు సాగుతున్నాయి. విశాఖలో వ్యాధి నిర్ధారణ పరికరం లేకపోవడంతో విశాఖ విమానాశ్రయంలో దిగుతున్న ప్రయాణికుల నుంచి రక్త నమూనాలు సేకరించి వ్యాధి నిర్ధారణ కోసం కాకినాడ పంపిస్తున్నారు. అక్కడ నుంచి రిజల్ట్ వచ్చేవరకు ఎదురు చూడాల్సి వస్తోంది. అయినా ఇప్పటి వరకు వ్యాధి నిర్ధారణ పరికరం ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని లోకనాథం అన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### పరిశుభ్రతే ప్రధానం

ఇప్పుడు ఇల్లు.. వాకిలి.. పల్లె.. పట్నం అన్నీ కాంక్రీట్ మయం. అప్పట్లోవాకిట్లో కల్లాపి చల్లి, ఇడుపులకు అలుకు పూసేవాళ్లం. ఇంట్లోకి ఏ పురుగూ పుట్రా రాకపోయేది. కడపకు పసుపు పూసేవాళ్లం. వైరస్‌లు.. బ్యాక్టీరియాలు దాన్నిదాటుకొని ఇంట్లోకి రాకపోయేవి. లోపలికి వస్తే కచ్చితంగా కాళ్లు, చేతులు కడుక్కునేవాళ్లం. దుమ్ము, ధూళి ఉంటే శుభ్రమయ్యేవి. కరోనా కాదు కదా దానికంటే శక్తిమంతమైన వైరస్‌లు వచ్చినా ఏం చేయలేని జీవనశైలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనాపై పూర్తిగా ద ృష్టి సారించాయి. ఐసోలేషన్ సెంటర్స్ ఏర్పాటునుంచి మొదలుకుంటే విమానాలు రద్దు చేయడం వరకు అన్నీపకడ్బందీగా నిర్వహిస్తున్నాయి. ఎప్పటికప్పుడు ప్రత్యేక బులెటిన్స్ విడుదల చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించి, ముందస్తు జాగ్రత్త చర్యలుగా విద్యా సంస్థలు, ఇతర కార్యాలయాలకు సెలవులు ప్రకటించింది. తగు జాగ్రత్తలు సూచించింది. మనం జాగ్రత్తగా ఉండటం ఎంత ముఖ్యమో అపోహలకు, వదంతులకు, అనుమానాలకు దూరంగా ఉండటం కూడా అంతే ముఖ్యమని ప్రతిరోజూ సూచిస్తున్నది. కాబట్టి ప్రజలు అర్థం చేసుకోవాలి. కరోనా.. మహమ్మారే కావచ్చు. ప్రపంచాన్ని అతలాకుతలం చేసేంత ప్రమాదకరమైందే అయుండొచ్చు. కానీ లోకాన్ని ముంచేంత శక్తి దానికున్నదా? బయట కరోనా గురించి చాలా చర్చ జరుగుతున్నది. జనాలు ఆందోళన చెందుతున్నారు. అదిగో కరోనా వచ్చె.. వచ్చె అని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఒకసారి ఆత్మపరిశీలన చేసుకుందాం. ఈ వైరస్‌లు.. బ్యాక్టీరియాలు మన నియంత్రణలో లేనివా? వైరస్ అనగానే మన గుండెలెందుకు గుభేల్‌మంటున్నాయి? ఎందుకంటే.. మనం మారిపోయాం. నిరోధక శక్తి నుంచి ఆరో గ్య విరోధక శక్తి వైపు మారిపోయాం. భయానికి దగ్గరగా.. భద్రతకు దూరంగా వెళ్లిపోతున్నాం. ఈ భయం మనం ఏర్పరుచుకున్నదే. ఈ అలజడి మనం ఆపాదించుకున్నదే. కరోనా గురించి మనసులో రేగే ఒక చిచ్చు.. కలకలం మన ఆలోచనలను అల్లకల్లోలం చేస్తూ ఒక కొత్త ఫోబియాకు అవకాశం కల్పిస్తున్నది. కరోనా చైనా నుంచి వ్యాప్తి చెందింది.. నిజమే. జరుగాల్సిన నష్టమైతే జరుగుతూనే ఉన్నది. మనం చూస్తూనే ఉన్నాం. అయితే ఎక్కడినుంచి వచ్చిందో అక్కడికి తరిమేయలేమా? కట్టడి చేయలేమా? ముట్టడించిందని మూలుగుతూ కూర్చుందామా? మనపై దాడి చేస్తున్న కరోనా ఒక వైరస్ మాత్రమే. మన కంట్రోల్‌లో మనం ఉండి దానినుంచి తప్పించుకుంటే సేఫ్‌లో ఉంటాం. తలవంచితే చేదు జ్ఞాపకంగా మారిపోతాం. ఇంత జరుగుతున్న కరోనా కలకలం గురించి ఇటలీ ఏం చెప్పింది? మం చి గుణపాఠమే చెప్పింది. 'మేం తప్పు చేశాం.. మీరు చేయకండి' అని మంచి సందేశమిచ్చింది. 'వైరస్ వ్యాపిస్తుంది.. బయటకు వెళ్లొద్దు' అని ఇటలీ ప్రభుత్వం ఎంతగా మొత్తుకున్నా జనాలు పట్టించుకున్న పాపాన పోలేదు. ముందస్తు చర్యగా సెలవులు ప్రకటిస్తే.. విహారయాత్రలు, విం దులకు వెళ్లారు. ఇంట్లో నుంచి బయటకు రావొద్దని చెప్తే వినకుండా గుం పులు గుంపులుగా వీధుల్లోకి వచ్చి ప్రభుత్వ సూచనను తేలికగా తీసుకున్నారు. ఒకరకంగా చాలా తప్పు చేశారు. ఇటలీ కరోనా మరణాల సంఖ్య ఎంత? 2,978 మంది. 35,713 మందికి కరోనా పాజిటివ్ ఉన్నది. ఇంకా ఎలా ఉండబోతుందో? దేశ పౌరులుగా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సింది పోయి తేలికగా తీసుకున్నారు. ఏమైంది? ఇవాళ ఇటలీ ఆర్థికవ్యవస్థ చిన్నాభిన్నమైంది. ఆ దేశం కరోనాను కట్టడి చేయలేదా? మందుల్లేకనా? డాక్టర్లు లేకనా? ఎందుకు పరిస్థితి ఇంతగా దిగజారింది? అంటే ఒక్కటే కారణం.. పౌరులకు స్వీయనియంత్రణ లేకపోవడమే. కేసుల సంఖ్య పెరుగడంతో వారికి ఎక్కడ ఐసోలేషన్ చేయాలో.. ఎక్కడ చికిత్స అందించాలో తెలియక అతలాకుతలమైన పరిస్థితి. ఇప్పుడు బాధపడుతున్నారు. 'మేం చేసిన తప్పు మీరు చేయకండి.. ప్రభుత్వం చెప్పిన సూచనలను పాటించండి' అంటూ మనకు సూచిస్తున్నారు. ఇటలీ అనుభవాల నుంచి మనం నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ఇటలీ మాదిరిగా మన దగ్గరా పరిస్థితులు చేయి దాటిపోకుండా చూసుకోవాల్సింది మనమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనాపై పూర్తిగా ద ృష్టి సారించాయి. ఐసోలేషన్ సెంటర్స్ ఏర్పాటునుంచి మొదలుకుంటే విమానాలు రద్దు చేయడం వరకు అన్నీ పకడ్బందీగా నిర్వహిస్తున్నాయి. ఎప్పటికప్పుడు ప్రత్యేక బులెటిన్స్ విడుదల చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించి, ముందస్తు జాగ్రత్త చర్యలుగా విద్యాసంస్థలు, ఇతర కార్యాలయాలకు సెలవులు ప్రకటించింది. తగు జాగ్రత్తలు సూచించింది. మనం జాగ్రత్తగా ఉండటం ఎంత ముఖ్యమో అపోహలకు, వదంతులకు, అనుమానాలకు దూరంగా ఉం డటం కూడా అంతే ముఖ్యమని ప్రతిరోజూ సూచిస్తున్నది. కాబట్టి ప్రజలు అర్థం చేసుకోవాలి.

## జర్నలిస్టులకు కరోనా నిరోధ మాస్కులు కొంపల్లి



విశాఖపట్నం : విశాఖలో కరోనా నియంత్రణకు ప్రభుత్వం ఒకవైపు చర్యలు చేపడుతుం టే మరోవైపు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి తమ వంతు సహాయం అందిస్తున్నాయి. ఆ క్రమంలో నిత్యం ప్రమాదపు అంచున విధులు నిర్వర్తించే జర్నలిస్టులకు కరోనా నిరోధక మాస్కును హార్బర్ ఇంటర్నేషనల్ స్కూల్ సీఈవో రఘురాజ్ పంపిణీ చేశారు. సర్కిట్ హౌస్ వీడియో జర్నలిస్టులు ఇతర జర్నలిస్టులకు మాస్కును పంపిణీ చేశారు. నిత్యం జనం మధ్య సంచరించే జర్నలిస్టులు వ్యక్తిగత భద్రత.. జాగ్రత్త ల మధ్య విధులు నిర్వర్తించాలని raghuraj కోరారు. ఈ మాస్టర్ పంపిణీ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ నగర అధ్యక్షులు రావులవలస రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## జానపద కళాకారులు బాడ సూరన్నను సత్కరించిన కలెక్టర్

శ్రీకాకుళం : జానపద కళాకారులు బాడ సురన్నను జిల్లా కలెక్టర్ జె నివాస్ అభినందించారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ దుశ్శాలువతో సత్కరించారు. ఇటీవల విడుదలైన అలా వైకుంఠపురం సినిమాలో చిత్రాలు చూడరో పాట పాడటం, శ్రీకాకుళం ఖ్యాతిని ఇనుమడింపజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సురన్నను అభినందించారు. శ్రీకాకుళం జిల్లా వాసిగా సినీ రంగంలో పాటలు పాడటం సంతోషం కలిగిందని కలెక్టర్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా కళాకారులకు పుట్టినిల్లు అన్నారు.

మంచి కళాకారులు జిల్లాలో ఉండటం గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు. గొప్ప కళాకారుల స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ పొందాలని పిలుపునిచ్చారు. సూరన్న మందస మండలం భైరి సారంగపురం వాసి. పేద కుటుంబంలో పుట్టి తన కులవృత్తి గంగిరెద్దుల ద్వారా జీవనం కొనసాగిస్తున్నారు. నిరక్షరాస్యుడు అయినప్పటికీ జానపద సంగీతం పట్ల మక్కువతో జానపద గీతాలను ఆలాపించేవారు.

గత 32 సంవత్సరాలుగా 350 జానపద గీతాలు ఆలపించారు. గత 10 సంవత్సరాలలో 75 పాటలను ఆల్బమ్ గా రూపొందించారు. వివిధ ప్రాంతాల్లో 5990 ప్రదర్శనలు ఇచ్చారు.

కరోనాపై పాట పాడాలి : జిల్లాలో కరోనా ఛాయలు ఉండరాదని అందుకు తగిన విధంగా మంచి పాటలు సమకూర్చాలని కలెక్టర్ సూరన్నను విజ్ఞప్తి చేసారు. ప్రజలందరకు అవగాహన కలగాలని ఆయన సూచించారు. దీనిపై స్పందిస్తూ కొద్ది రోజుల్లో మంచి పాటను సమకూర్చుతానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య శాఖ ఇఇ పి.సుగుణాకర రావు పాల్గొన్నారు.

## భారత రత్న ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ జయంతి (మార్చి 21)



భారత రత్న షేహనాయ్ విద్వాంసుడు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ 1916 మార్చి 21 న బీహార్ రాష్ట్రంలో జన్మించారు. వీరిది సంగీత విద్వాంసుల కుటుంబం. తండ్రి పైగంబర్ ఖాన్ షేహనాయ్ విద్వాంసుడు. మేనమామ అలీభక్ష్ వద్ద వీరు షేహనాయ్ వాయిద్యం నేర్చుకున్నారు. వారసత్వంగా లభించిన సంగీత వాయిద్య పరిజ్ఞానానికి వీరు మెరుగులు దిద్ది, ప్రపంచ ప్రఖ్యాత వాయిద్య కళాకారుల్లో ఒకరిగా నిలిచారు. 1937 లో కోల్ కతా నగరంలో జరిగిన అఖిల భారత సంగీత మహాసభల్లో వీరు షేహనాయ్ వాద్యం సంగీత ప్రపంచంలో ఒక గొప్ప గౌరవ స్థానం పొందేలా చేశారు. గతంలో పెళ్ళిళ్ళలో వాయించే ఒక సాధారణ వాయిద్యం గా ఉంటూ వచ్చిన సెహనాయ్ వాయిద్యాన్ని కి మహాసభల స్థాయిని కల్పించిన కృషి, ఘనత బిస్మిల్లా ఖాన్ దే. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ముఖ్య ఘట్టాలైన 1947 ఆగస్ట్ 15 స్వాతంత్ర్య దినం రోజున, 1959 జనవరి 26 రిపబ్లిక్ దినం నాడు ఎర్ర కోటలో వీరు సెహనాయ్ వాయించి, ఆ ఉత్సవాలకు అదనపు ఆకర్షణ కూర్చారు. ప్రపంచంలోని ముఖ్య దేశాల రాజధానుల న్నింటిలో దాదాపుగా వీరు సెహనాయ్ వాయిద్య ప్రదర్శనలిచ్చారు. గంగా నది, వారణాసి నగరానికి వీరికి విడదీయలేని అనుబంధం ఉంది. గొప్ప అవకాశాలు తలుపు తట్టిన గంగను, వారణాసి నీ వదలనని భీష్మించుకుని కూర్చున్నారు. పద్మ శ్రీ, పద్మ భూషణ్, పద్మ విభూషణ్ బిరుదులతో తృప్తి పడని కేంద్ర ప్రభుత్వం 2001 లో భారత రత్న పురస్కారం వీరికిచ్చుకుని తృప్తి పడింది. ఇక వీరికి వచ్చిన మిగిలిన అవార్డులు, గౌరవాలకు లెక్కేలేదు. వీరు 2006 ఆగస్ట్ 21 న భౌతికంగా మరణం పొందినా, తన సంగీత తో ప్రజల గుండెల్లో జీవించి ఉన్నారు.

### మాస్కుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

- మెడికల్ షాపుల యజమానులను హెచ్చరించిన ఆర్.డి.ఓ - యం.వి.రమణ

శ్రీకాకుళం : జిల్లాలో కరోనా వైరస్ ( కోవిడ్ 19 ) నియంత్రణ దృష్ట్యా మాస్కులకు కృత్రిమ కొరతను సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీకాకుళం రెవిన్యూ డివిజనల్ అధికారి యం.వి.రమణ మెడికల్ షాపుల యజమానులను హెచ్చరించారు. జిల్లాలో మాస్కులకు కృత్రిమ కొరతను సృష్టిస్తూ, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అందులో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆయన నగరంలోని సూర్య మహల్ కూడలి వద్ద పలు మెడికల్ షాప్ లను తనిఖీచేసారు.

జిల్లాలో కరోనా వైరస్ నియంత్రణ కోసం జిల్లా యంత్రాంగం పలు చర్యలు చేపట్టిందన్నారు.

అందులో భాగంగా మాస్కుల కొరకు వచ్చే ప్రజానీకానికి మాస్కులను విక్రయించాలని, కృత్రిమ కొరతను సృష్టించరాదన్నారు.

## సమకాలీనం

### 'తెలుగు - వెలుగు'

అందరిని జట్టు కట్టు
అందరిని కట్టు కట్టు
మూకుమ్మడిగ - తెలుగువారంటు
తెలుగుభాష వాడుతుండు
తెలుగుభాష ఫలుకుతుండు
తెలుగుభాష విలువలుంచు
పద్యమైన - గద్యమైన - శతకమైన
కథైన - కవితయైన,
ఎంతో కొంత చదవడం తెలుగువారు సొంతం
కలగ - పులగం ఆంగ్ల పదాలు కలపొద్దు
తెలుగువారింట పుస్తకాలుంటే? సంపదున్నంత.
కొస మెరుగులు వరకు - కోరుకుంటు తెలుగు
ప్రతి కొంప, కొంపకు - అచ్చ తెలుగు తెలుసు
పని పాటులతోను - తెలుగు పాట పాడు - సులువుగ పాటు బాగుచేయు
తెలుగులో మాధుర్యం చిలుకు - బాలలు ఉచ్ఛరణే ముద్దులొలుకు.
విడమరచి తెలుగు ఫలుకు - కలుపుగోరు తెలుపు
భావాలు పుట్ట తెలుగు - తెలుగు భాషకే కలుగు
తెలుగులోనే ఫలుకు - భాష విలువ తెలుపు
ప్రకటనలన్నీ చేయు - తెలుగుభాషలోనే....

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు

## పంచాంగం

మాసం : ఫాల్గుణ ; తిథి : ద్వాదశి ఉ.8.42; ధనిష్ట రా.8.13; తె.వ.4.02ల 5.46. | శనివారం 21-03-2020

**మేషం** : వృత్తి, ఉపాధి పథకాల్లో స్థిరపడతారు. నోరు అదుపులో ఉంచుకోవడం శ్రేయస్కరం. అనుకున్న పని మొదలెట్టే సమయానికి ఆటంకాలు ఎదురవుతాయి. సభ్యత్వాలు, పదవులకు స్వస్తి పలుకుతారు. పెద్దల ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతుంది. వృత్తి వ్యాపారాల్లో మొహమ్మాటాలు తగవు. ఉద్యోగస్తులు, ఉపాధ్యాయులకు ఒత్తిడి, పనిభారం అధికం. మీ సమర్థత వల్ల అధికారులు, సహోద్యోగులకే లాభిస్తుంది. **వృషభం** : పుణ్యక్షేత్రాలు, కొత్త ప్రదేశాలు సందర్శిస్తారు. రుణాలు, చేబదుళ్లు స్వీకరించవలసి వస్తుంది. మీ సంతానం విద్యా, ఉద్యోగ విషయాలపై శ్రద్ధ అవసరం. మీ సంతానం పొందిన వారే తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తారు. పత్రికా సిబ్బందికి మార్పులు అను కూలిస్తాయి. పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలేర్పడతాయి. **మిథునం** : మీ శ్రీమతితో ఉల్లాసంగా గడుపుతారు. పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలేర్పడతాయి. వృత్తుల వారికి గుర్తింపు, ప్రజాసంబంధాలు బలపడతాయి. శ్రమాధిక్యత, వ్యవ హారాల్లో ప్రతికూలతలు అధికం. మీ ప్రమేయం లేకున్నా మాటపడవలసివస్తుంది. జాగ్రత్త వహించండి. సోదరీ సోదరులతో ఆస్తి పంపకాలను ప్రస్తావిస్తారు. **కర్కాటకం** : దంపతుల మధ్య అనురాగ వాత్సల్యాలు పెంపొందుతాయి. పుణ్య కార్యాలకు సహాయమందిస్తారు. నూతన కాంట్రాక్టులు, లీజు గడువు పొడిగిం పులకు అనుకూలం. ఆశలొదిలేసుకున్న బాకీలు వసూలు కాగలవు. విశ్రాంతి లోపం, అకాల భోజనం వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. వ్యాపారాల్లో ఆశించిన లాభాలు గడిస్తారు. **సింహం** : భాగస్వామిక చర్చల్లో కొత్త అంశాలు చోటు చేసుకుంటాయి. రిప్రజెంటేటివ్‌లు టార్గెట్‌ను అధిగమిస్తారు. గృహ నిర్మాణాలకు ప్లాను ఆమోదంతో పాటు రుణాలు మంజూరు కాగలవు. ప్లీడర్లు, ప్లీడరు గుమాస్తా లకు చికాకులు అధికం. పొగడ్తలు, ప్రలోభాలకు దూరంగా ఉండాలి. స్త్రీల ప్రతిభ చాటుకునే అవకాశం వస్తుంది. **కన్య** : వైద్యరంగాల వారు క్లిష్టమైన శస్త్ర చికిత్సలను సమర్థంగా నిర్వహిస్తారు. పెద్దమొత్తం ధన సహాయంలో పునరా లోచన అవసరం. కోర్టు వ్యవహారాలు ఒక కొలిక్కి రాగలవు. ప్రయాణాల లక్ష్యం నెరవేరు తుంది. ఉద్యోగస్తుల ప్రమోషన్‌కు అభ్యంతరాలెదురవుతాయి. **తుల** : వృత్తి వ్యాపారాల్లో ఆటంకాలు, చికాకులు తప్పవు. ఏ పని సక్రమంగా సాగక విసుగు చెందుతారు. యాదృచ్ఛికంగా ఆలయాలను సందర్శిస్తారు. మీ బంధువులను సహాయం అర్థించే బదులు మీరే ప్రత్యామ్నాయం చూసుకోవటం ఉత్తమం. మీ పనులు మందకొడిగా సాగుతాయి. మీ మౌనం వారికి గుణపాఠమవుతుంది. **వృశ్చికం** : కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్ల ధోరణి ఆందోళన కలిగిస్తుంది. పుణ్యక్షేత్రాలు, కొత్త ప్రదేశాలు సందర్శిస్తారు. ప్రయాణాల లక్ష్యం నెరవేరకపోవటంతో నిరుత్సాహానికి గురవుతారు. సిమెంటు స్టాకిస్టులు, వ్యాపారులకు మిశ్రమ ఫలితం. ప్రముఖుల ఇంటర్వ్యూ కోసం అధిక సమయం వేచి ఉండాల్సి వస్తుంది. **ధనుస్సు** : అగ్రిమెంటు, రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో మెలకువ వహించండి. ఖర్చులు అదుపుకాకపోగామరింత ధన వ్యయం అవుతుంది. మీ శ్రీమతి మీరంటే ప్రత్యేకాభిమానం కలుగుతుంది. సమా వేశానికి ఏర్పాట్లు చేయడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. **మకరం** : పాత సమస్యలకు చక్కని పరిష్కార మార్గం గోచరిస్తుంది. ప్రేమికుల ఆలోచనలు పెడదారిపట్టే ఆస్కారం ఉంది. సామాజిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉద్యోగస్తుల పదోన్నతికి అధికారులు సిఫార్సు చేస్తారు. కొన్ని విలువైన వస్తువులు అనుకోకుండా కొనుగోలు చేస్తారు. **కుంభం** : రహస్యాన్ని దాచలేని మీ బలహీనత ఇబ్బంది కలిగిస్తుంది. స్త్రీలకు పనివారలతో చికాకులు, శ్రమ అధికం. లక్ష్య సాధనకు విద్యార్థులు మరింతగా కృషి చేయాలి. ఉద్యోగస్తులకు ప్రమోషన్, బదిలీ ఉత్తర్వులు అందుతాయి. **మీనం** : ఏజెన్సీలు, లీజు, గడువు పొడిగిం పులకు అనుకూలం. విద్యార్థినిల్లో ఏకాగ్రత, స్థిరత్వం నెలకొంటాయి.



## శబరిమల పదునెట్టాంబడి

### సంకీర్తన

జన్మలన్నింటిలో మానవజన్మను మించింది లేదంటారు. చేసిన తప్పొప్పులకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలంటే పద్దెనిమిది సోపానాలను స్పర్శించాలి. అప్పుడే సమస్త పాపాలూ హరించబడతాయి. ఆ సోపానాలే పదు నెట్టాం బడి. 18 మంది ఆధిదేవతలు 18 సోపానాలుగా, పదునెట్టాంబడి పేరుతో 18 మెట్లుగా మారిన అద్భుతం శబరిమలలో మనకు సాక్షాత్కరిస్తుంది. అయ్యప్ప మాల ధరించిన స్వాములు తమ దీక్షకు పరమార్థం సిద్ధించేది పదునెట్టాంబడిని అధిరోహించినప్పుడు మాత్రమేనని నమ్ముతారు. అప్పుడే స్వామివారి దర్శనం, పాపహరణం సాధ్యమవుతుందన్నది వారి విశ్వాసం. అయ్యప్ప స్వామి దీక్ష తీసుకున్న భక్తులు అత్యంత నియమ నిష్ఠలతో శబరిమల చేరుకుంటారు. స్వామివారి సన్నిధానానికి చేరుకోవాలంటే వీళ్లు పదునెట్టాంబడి పేరుతో పిలువబడే 18 మెట్లను ఎక్కవలసి వుంటుంది. ఈ 18 సోపానాలు అత్యంత పవిత్రమైనవిగా, శక్తి మంతమైనవిగా వారు భావిస్తారు. నలభై అడుగుల ఎత్తయిన పీఠాన్ని అయ్యప్ప స్వామి అధిరోహించడం కోసం 18 మంది అధిదేవతలు 18 సోపానాలుగా మారారని పురాణాలు చెబుతున్నాయి. ఆ 18 మంది దేవతలు ఛండిక, అన్నపూర్ణ, భద్రకాళి, భైరవి, సుబ్రహ్మణ్యేశ్వర, గంధర్వ, కార్తవీర్య, తృషనా భాయ, శృతి బేధక, కటు శబ్దక, యుడుంబు, భేతాళ, హరిప్రియ, కర్ణ పిశాచి, పుళిందిని, రేణుక, ప్రదీపిక, ప్రత్యంగిరాలుగా పిలుస్తారు. మాలధారణ చేయని వారికి ఈ మెట్ల మీదుగా ప్రవేశం వుండదు. మండల దీక్ష తీసుకుని ఇరుముడి కలిగిన భక్తులకు మాత్రమే ఈ సోపానాల మీదుగా స్వామి సన్నిధానానికి రావాలన్నది నియమం.

18మెట్లలోఒక్కోమెట్టుకు ఒక్కో విశిష్టత ఉంటుంది. ఈ మెట్లు గ్రానైట్‌తో నిర్మించినా 1985లో పంచలోహాలతో తాపడం చేశారు. వీటిని పరశురాముడు నిర్మించాడని చెప్తారు.

అష్టదిక్పాలకులు ఎనిమిది మంది(ఇంద్రుడు, అగ్ని, యముడు, నైరుతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, ఈశాన్యుడు), రెండు యోగములు (కర్మ యోగం, జ్ఞానయోగం), తరువాతవి విద్య, ఆవిద్య, జ్ఞానం, అజ్ఞానికి రూపాలుగా కూడా ఈ మెట్లను చెప్తారు. ఈ ఆలయంలో స్వామి కొలువైన సందర్భంగా మృదంగ, భేరి, కాహళ, దుందుభి, తుంబురు, మర్దల, వీణ, వేణు, నూపుర, మట్టుక, డిండిమ, ఢమరుక, ఢంక, దవళ, శంఖ, పటహ, జజ్జరి, జంత్ర అనే 18 వాయిద్యాలను మ్రోగించారట. ఈ మెట్లను పూజించడాన్నే పడిపూజ అని అంటారు.

అయ్యప్ప స్వామి పుట్టుక: ముక్కోటి హిందూ దేవతలలో అయ్యప్ప స్వామి ఒకరు.

ఈయనను హరిహర సుతుడని, ధర్మశాస్త్ర, మణికంఠుడని కూడా పిలుస్తారు. శివుడు, విష్ణువుల సంగమం వల్ల పుట్టాడు, కనుక ఈ పేరు వచ్చిందని తెలుస్తోంది. అయ్య= విష్ణువు, అప్ప = శివుడు అని అర్థం. క్షీరసాగర మధనం అనంతరం విష్ణువు మోహినిగా అవతరించి దేవతలకు, రాక్షసులకు అమృతం పంచడానికి పూనుకుంటాడు. ఈ క్రమంలోనే అదే రూపంలో విహరిస్తున్న మోహిని పట్ల శివుడు ఆకర్షితుడవుతాడు.

అలా శివకేశవుల తేజస్సుతోనే అయ్యప్ప జన్మించాడన్నది పురాణ కథనం. మహిషి అనే రాక్షసిని సంహరించడం కోసం అయ్యప్పకు వీరిద్దరికీ జన్మించాడన్నది ఆయన పుట్టుకలో ఉన్న రహస్యం. ఆ రాక్షసిని చంపి అయ్యప్ప శబరిమలైలో వెలిశాడంటారు. దీక్షా, నియమాలు: భక్తులు కార్తీకమాసం నుండి దాదాపు మార్గశిర, పుష్య మాసాల వరకూ కఠినమైన నియమాలను ఆచరిస్తారు. ఐహికమైన సౌఖ్యాలను త్యజించడం,

FINANCE
ఒన్లీ రిటైర్డ్ పెన్షనర్లకు మాత్రమే
రూ. 30వేల నుండి 3 లక్షల వరకు
విశాఖ నుండి విజయవాడ వరకు
మధ్యలో ఎక్కడైనా సరే స్పాట్ ఫైనాన్స్
(with A/c Pay) చేయబడును.
JK అసోసియేషన్ సర్వీసెస్
Govt. Reg. No. 136/2009 (నో బ్రోకర్స్)
96665 47338

బిజినెస్ ఆఫర్
అవగాహన కోసం రాజమండ్రి వచ్చి రూ.1650లతో కొన్నవారికి, కొనిపించిన వారికి బహులాభాల అపూర్వ అవకాశం.
9393068546, 6300172408

## నిర్మానుష్యంగా
# సింహగిరి ఆలయ పరిసరాలు
### రాజగోపురం వద్ద నుండి వెనుదిరిగిన భక్తులు



సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారి సింహగిరి ఆలయ పరిసరాలు మొత్తం నిర్మానుష్యంగా మారాయి. కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో అప్పన్న దర్శనాలు నిలిపివేసిన నేపథ్యంలో సమాచారం తెలియని కొందరు భక్తులు మెట్ల మార్గం గుండా సింహగిరికొండపైకి చేరుకొని ఆలయం దర్శనాలు నిలిపి వేతతో భక్తులు రాజగోపురం వద్ద నుండి స్వామికి నమస్కరించి వెనుతిరిగారు.

# వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీ హెూమం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి కొండపై కొలువైయున్న వనదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం చండీ హెూమము ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గం.లకు పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం,అమ్మవారికి మూల,మంత్ర జపములు,సప్తపతి పారాయణములు నిర్వహించారు.11 గం.లకు పూర్ణహుతి గావించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు ఇంధ్రగంటి.నరసింహమూర్తి ఆద్వర్యంలో చల్లపల్లి.ప్రసాద్ శర్మ,కొంపెల్ల.మూర్తి,కూచిబొట్ల.ప్రసాద్,దేవులపల్లి.ప్రసాద్,ముత్య.వెంకట్రావు మరియు వేదపండితులు,అర్చకులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రసాద్,టెంపుల్ ఇన్ స్పెక్టర్ పోల్నాటి లక్ష్మీనారాయణ మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.వేద పండితుల వేద ఆశీర్వాదములు అనంతరం తీర్ధ,ప్రసాదములు అందజేశారు.

## కరోనా వైరస్ కారణంగా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో
# ప్రైవేట్ రిసార్ట్లుకి తహశీల్ధార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పలు సూచనలు

అనంతగిరి : కరోనా వైరస్ కారణంగా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ప్రయివేటు రిసార్ట్సు వారికి అనంతగిరి, తహసీల్దార్, మండలపరిషత్ అభివృద్ధి అధికారి పలు సూచనలు చేయడం జరిగింది. అనంతగిరి పర్యాటక శాఖ ఆధ్వర్యంలోని హరిత రిసార్ట్ లో కరోనా వైరస్ నిరోధక చర్యలులో భాగంగా పర్యాటకులను అనుమతించ వద్దని సూచిస్తూ హెచ్చరిక ఉత్తర్వులను స్థానిక తహశీల్దార్, ప్రసాద్ మరియు ఎమ్.పి.డి.ఓ కూర్మారావులు అతికించడం జరిగింది. అదేవిధంగా ప్రైవేట్ రిసార్ట్స్ మరియు లాడ్జీల యాజమాన్యాలకు తెలియజేశారు.



## వాయిదాపడిన ఎలక్షన్ల సందర్భంగా
# ఓటర్ నమోదు కార్యక్రమాలు చేపట్టాలి : సిఐటియు




విశాఖపట్నం: సీఐటీయు ఆఫీసు నందు శుక్రవారం జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ జరిగింది. ఈ సందర్భంగా జీవీఎంసీ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అధ్యక్షులు జి. సుబ్బారావు మాట్లాడుతూ ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ మహమ్మారి అలజడి వలన ఏపీలో ఆరు వారాల పాటు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ వాయిదా పడిన సంగతి అందరికీ తెలిసిందే.

అయితే జివిఎంసిలో 98 వార్డులలో వార్డ్ల వారీగా ఉన్న ఓటర్లకు లకు చాలా వరకు ఓటు హక్కు వినియోగించి కొనుటకు ఓటర్ లిస్ట్ లో నమోదు కాని వారికి ఒక్క అవకాశం ఎలక్షన్లు జరిగే లోగా ఓటర్ నమోదుకి ఏపీ ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్ అనుమతి ఇవ్వాల్సిందిగా సిపిఎం పార్టీ గా కోరడమైనదని అన్నారు.

ఓటర్ నమోదు కార్యక్రమం చెపెట్టినట్లయితే ఓటు హక్కు వినియోగించుకుటకు అందరకు ప్రజాస్వామ్య హక్కు ప్రజలు కల్పించుటకు ఉపయోగపడుతుంది అని అన్నారు. ఈ ప్రెస్ మీట్ లో కె.వి.రమణ. గొలగా ని.అప్పారావు. రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్ల చిన్నారి హాసిని ఘనత
## ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

విశాఖపట్నం: మధురవాడలోని చంద్రంపాలెం ప్రాంతంలో నివాసం వుంటున్న బి.హాసిని స్థానిక ప్రైవేటు పాఠశాలలో యూకేజీ చదువుతుంది. రెండేళ్ళ వయస్సు నుంచే ఆమెలో చురుకుదనం గుర్తించిన తల్లిదండ్రులు కుమార్తెను అన్ని రంగాల్లో ప్రోత్సహించారు. ఈ క్రమంలో తెలుగు, హిందీ, ఆంగ్లం, సింధి భాషల్లో 53 రకాల గీతాలు ఆలపిస్తూ నృత్యాలు చేసింది.

ఓంకారం, జాతీయ గుర్తులు, ఒకటి నుంచి మప్పై వరకు హిందీ అంకెలు, రాష్ట్ర రాజధానుల పేర్లు, జాతీయ గీతం, ఇండియా మ్యాప్‌లో ఉండే రాష్ట్రాలను గుర్తించడం, చిత్రలేఖనం తదితరాల్లో చిన్నారి చూపిన ప్రతిభను గుర్తింపుగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం కల్పించారు. ఈ సందర్భంగా హాసిని తల్లిదండ్రులతో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ తదితరులు చిన్నారిని అభినందించారు.




## 7వ జిల్లా కోర్టులో ఎపిపిగా
# ఎన్‌వియస్ మూర్తి (బాలు)



పెద్దాపురం : పెద్దాపురం పట్టణంలో గల 7వ జిల్లా కోర్టులో ఎపిపిగా ఎన్‌వియస్.మూర్తి (బాలు) శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో అక్టోబరు 2019లో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పెద్దాపురంలో పనిచేశారు.

# ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడం తగదు



అనకాపల్లి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యలు విపక్షాలు వక్రీకరించడం తగదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. కరోనా రాకుండా ముందు జాగ్రత్తగా యాంటిబెటిక్ వేసిన తర్వాత ఒక పారాసిట్‌మాల్ తో తగ్గుతుందని ఆయన చెప్పలేదన్నారు. కొంత మంది నాయకులు పనికట్టుకుని తప్పుడు ప్రచారానికి దిగుతుందని చెప్పారు. భయంకరమైన కరోన విపక్తినుండి భయట పడాల్సిన తరుణంలో విమర్శలకు దిగడం సమంజసంకాదన్నారు. అన్ని రాజకీయ పార్టీలు స్వచ్ఛంద సంస్థలు ఒక తాటిపైకి వచ్చి కరోనా బారీన పడకుండా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్సిన అవసరం ఉందన్నారు. కరోనా భూతం నుండి ప్రజలను గట్టుఎక్కించే చర్యలపై దృష్టిసారించాలన్నారు. రాజకీయ విద్వేశాలను పక్కన పెట్టి డాక్టర్లకు పోలీసులకు సహాయ పడాలన్నారు. ప్రజలలో ఉన్న ఆందోళన నుండి గట్టెక్కించాల్సి ఉందన్నారు. ఇళ్ల పరిసరాలలో బ్లీచింగ్ చల్లి శుబ్రత పాటించాలన్నారు. 102 డిగ్రీల కన్నా జ్వరం ఉంటే ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని నాగేశ్వరరావు కోరారు.

# నూకాంబికా ఆలయం మూసివేత



అనకాపల్లి : నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని మూసివేస్తున్నట్లు సహాయకమీషనర్ అన్నపూర్ణ శుక్రవారం ప్రకటించారు. పత్రికలకు ఆమె ప్రకటన విడుదల చేసారు. ఈనెల 22 నుండి వచ్చే నెల 23 వరకు నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య మహోత్సవాలు జరగవలసి ఉందన్నారు. అయితే కరోనా వైరస్ ప్రభావంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాతరను నిలిపివేయడమే కాకుండా దేవస్ధానంలో అమ్మవారి దర్సనంలు నిలుపుచేయడం జరుగుతుందన్నారు.

ఈనెల 31న తర్వాత అవసరమైన నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. భక్తులు గమనించి దేవస్ధాన అధికారులతో సహకరించాలని, ఆమె కోరారు.

# పంచాయతీల్లో పన్నులు వసూలు వేగవంతం

**- 27 పంచాయితీల్లో చింతలపూడి 100% - మిగిలిన పంచాయతీల్లో 85 శాతం - సహకరిస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులు**

దేవరాపల్లి : దేవరాపల్లి మండలం లోని 27 పంచా యితీల్లో ఇంటి, నీటి పన్నులు వసూలు ఈ విషయంలో గతంలో కంటే మిన్నగా ఈ ఏడాది వేగం పుంజుకుంది. మార్చి 31వ తేదీతో ఆర్థిక సంవత్సరం ముగుస్తుడడంతో పన్నులు వసూలు చేయాల్సిన కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగు సహాయ సహకారాలను తీసుకోవడంతో ఈ దఫా 100 శాతం వసూలు చేసే దిశగా అడుగులు ముందుకు పడుతున్నాయి. ఈ ఏడాది కరెంట్ డిమాండ్ రూ.45 లక్షలు ఉంది ఇప్పటివరకు సుమారు రూ. 1 లక్ష 49వేలు వరకు వసూలు చేసినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. గత ఏడాది వరకు ఇంటి, నీటి పన్నులు వసూలు చేయడానికి పంచాయితీ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సమావేశాలు ఇతర పనులతో ఉక్కిరిబిక్కిరి అయ్యేవారు. దీంతో ఆయా పంచాయతీలోని ఇంటి, నీటి పన్నులు వసూలు కావలసిన సొమ్ము పూర్తిగా వసూలు చేయలేని దుస్థితి నెలకొనేది. ఇంటికి వెళ్లి అడిగే తీరుబడి కూడా లేకుండా ఉన్నతాధికారులు ఇతర పనులు బాధ్యతలను అప్పగించడంతో సతమతమయ్యే దుస్థితి ఉండేది. మండలంలో 27 పంచాయతీల్లో ఇంటి, నీటి పన్ను కింద రూ. 4461460 లక్షలు వసూలు చేయాలి.

**100% దిశగా అడుగులు:** ఆర్థిక సంవత్సరం మార్చి 31వ తేదీతో ముగుస్తుండటంతో ఆ తేదీకి ఇంకా 10 రోజులు సమయం మాత్రమే ఉంది.

మండలంలోని 27 పంచాయతీల్లో ఇప్పటికే చింతలపూడి పంచాయతీ 100% పూర్తి చేసింది. మిగిలిన పంచాయితీలు కూడా 75 శాతం నుంచి 85 శాతం ఒక్కొక్క పంచాయతీ 90 శాతం వరకు వసూలయ్యాయి.

**గత ఏడాది కంటే మెరుగైన వసూలు:** గత ఏడాది కరెంట్ డిమాండ్ రూ.4249010 ఉండగా రూ. 1032108 మాత్రమే వసూలు చేయగలిగారు. ఈ ఏడాది డిమాండ్ రూ.4461460




ఉండగా ఇప్పటివరకు సుమారుగా రూ.19 లక్షల వరకు వసూలు చేసినట్లు అధికారులు గణాంకాలు మరింత చేరువయ్యేలా సచివాలయంలోని సిబ్బంది సహాయ సహకారాలు తీసుకొని పంచాయతీ కార్యదర్శులు అడుగులు ముందుకు వేస్తున్నారు.

**లక్ష్యాన్ని చేరుకుంటాం:** ఇంటి పన్నులు వసూలు విషయంలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటాం. పని భారం ఉన్న సిబ్బంది శ్రమించి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి శక్తివంచన లేకుండా కష్టపడుతున్నాం.

ఇప్పటికే పలు పంచాయితీలో 100 శాతం పన్నులు వసూలు అయ్యేలా గతం కంటే మిన్నగా ఈ ఎడాది పన్నులు వసూలు వసూలవుతాయి అనుకుంటున్నా. సచివాలయ ఉద్యోగుల సహాయ సహకారాలు కూడా తీసుకుంటున్నాం అందువల్ల తప్పకుండా 100% కాకపోయినా మండలం అంతా 99 శాతం అయినా వసూలు చేస్తామని నమ్మకముంది.

- ఎం. రాధిక, ఈఓపిఆర్ డి దేవరాపల్లి

# ఇటలీ వీధులు వెలవెల

రోమ్ : కరోనా వైరస్ ధాటికి ఇటలీ చిగురుటాకులా వణుకుతోంది. వైరస్ కారణంగా దేశ వ్యాప్తంగా ఇప్పటికే 3,405 మంది మృతి చెందగా.. 41,035 పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. దీంతో కరోనా మృతులు అత్యధికంగా నమోదైన దేశంగా ఇటలీ తొలిస్థానంలో నిలవగా.. చైనాలో 3242 మంది వైరస్ కారణంగా కన్నుమూశారు. మరోవైపు శుక్రవారం నాటికి ప్రపంచ వ్యాప్తంగా వైరస్ మృతుల సంఖ్య పదివేలకు చేరింది. ఇక కోవిడ్‌తో ఇటలీలోని ప్రముఖ నగరాల్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు అక్కడి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఏ ఒక్కరూ బహిరంగ ప్రదేశాలకు రావడంలేదు. వైరస్ ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో జనాలు బయటకురావడానికి జంకుతున్నారు. గత ఇరవై రోజులుగా దేశ వ్యాప్తంగా అన్ని కార్యాలయాలు, మాల్స్, విద్యాసంస్థలు మూసివేయడంతో ఇటలీ వీధుల్లో పూర్తిగా కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తోంది.

# కరోనా నిరోధానికి మహిళా శక్తి సహకారం:
## జిల్లా కలెక్టర్ జె.నివాస్

శ్రీకాకుళం : కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి మహిళా శక్తి సహకరించాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా మహిళా సమాఖ్య భవనంలో కరోనా వైరస్ పై జిల్లా కలెక్టర్ మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కరోనా వైరస్ అనేది విదేశాల నుండి వచ్చిన వారి నుండి వ్యాప్తి చెందుతుందన్నారు. వారిని 14 రోజుల పాటు ప్రత్యేకంగా (ఐసోలేటెడ్) వుంచాలన్నారు. కరోనా వ్యాప్తి చెందకుండా వుండడానికి స్వయం క్రమశిక్షణ, పరిశుభ్రత, పారిశుధ్యం వంటి చర్యలు అవసరమన్నారు. శ్రీలంకలో మలేరియాను పూర్తిగా అరికట్టగలిగారని, పరిశుభ్రత, క్రమశిక్షణతో వారు అవలంభించిన పద్ధతుల ద్వారా మలేరియా రహిత దేశంగా రూపొందించుకున్నారన్నారు. మన దేశంలో పరిశుభ్రత లోపం, సరైన మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం ద్వారా నలభై శాతం మంది పిల్లలు రక్తహీనతతోను, పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారన్నారు. క్రమ శిక్షణ పాటించని కారణంగా ఇటలీ దేశంలో కరోనాతో మరణించిన వారి సంఖ్య చాలా ఎక్కువగా వుందని చెప్పారు. సుమారు 3 వేల మంది కరోనాతో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. కావున ప్రజలు బహిరంగ ప్రదేశాలలో తిరగరాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ప్రకటించడం జరిగిందన్నారు. ప్రముఖ తిరుపతి దేవాలయాన్ని సైతం మూసివేయనున్నట్లు తెలిపారు. మన జిల్లాలో తీర ప్రాంత మత్స్యకారులు విదేశాల నుడి రావడం వలన వారిని ఇంట్లోనే 14 రోజుల పాటు వుంచడం జరుగుతున్నదన్నారు. దీని వలన వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చునన్నారు.

# డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ల తేదీలు మార్చుకోవాలి
## ఉప రవాణా కమీషనర్ వి.సుందర్

శ్రీకాకుళం : కరోనా వైరస్ ( కోవిడ్ 19 ) ప్రభావం వలన జిల్లాలో డ్రైవింగ్ లైసెన్స్ కొరకు దరఖాస్తు చేసుకున్న స్లాట్లలో మార్పులు చేసుకోవాలని ఉప రవాణా కమీషనర్ వి.సుందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కమీషనర్, రవాణా శాఖ, విజయవాడ వారు ఉత్తర్వులు జారీచేసారని చెప్పారు. మార్చి 21 నుండి ఏప్రిల్ 5 వరకు స్లాట్స్ కలిగి ఉన్న వారందరూ తమ యొక్క టెస్ట్ తేదీలను ఏప్రిల్ 5 తరువాత మార్చుకోవాలని ఆయన చెప్పారు. అదేవిధంగా 3 టయర్ సాఫ్ట్ వేర్ లో టిఆర్ చేయబడి రిజిస్ట్రేషన్ కాకుండా మిగిలియున్న వాహనములు, సెకెండ్ హ్యాండ్ వాహన యజమానుల పనులకు 3 టయర్ సాఫ్ట్ వేర్ లో చేసుకొనుటకు మార్చి 21 నుండి ఏప్రిల్ 5 వరకు రద్దు చేసినట్లు ఆయన చెప్పారు. ఏప్రిల్ 6వ తేదీ తరువాత శ్రీకాకుళం ఉప రవాణా కమీషనర్ వారి కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

# లైసెన్స్ లేని బోట్ యజమాని పై చర్య తీసుకుంటాం

భీమునిపట్నం : లైసెన్స్ లేకుండా కొందరు మత్స్యకారులు చేపలవేట కొనసాగిస్తున్నారనీ, ఆలా వెళ్లిన వారి బోట్లను సీజ్ చేయడమే కాకుండా, వారిపై చర్యలు తీసుకుంటామని మెరైన్ పోలీస్ స్టేషన్ సి.ఐ బి.రమణ మూర్తి తెలిపారు. మత్సకారుల తో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ చేపలవేట చేసే బోట్లకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలనీ అన్నారు. అంతేకాకుండా బోట్లకు మత్స్య శాఖ సూచించిన రంగులను మాత్రమే వేయాలనీ చెప్పారు. సంబంధిత అధికారులకు ఈ కార్డులు తప్పనిసరిగా చూపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# కరోనా వైరస్ బారిన పడకుండా ఉపాధి హామీ పథకం వారు ఫ్లెక్సీలు ఏర్పాటు



అనంతగిరి : మండలంలో ఉపాధి హామీ పథకం వేతనదారులు కరోనా వైరస్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల కోసం ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడాన్ని అదనపు పథక సంచాలకులు గౌరవ మల్లికార్జున రావు పరిశీలించారు. వేతనదారులు తీసుకోవలసిన జాగ్రత్తల గూర్చి తెలుపుతూ స్వీయ నియంత్రణ తోనే కరోనా నివారణ సాధ్యం అని తెలియజేశారు.

అయితే ఎటువంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదు అన్నారు. మాస్కులు ధరించాలి, చేతులను సబ్బుతో శుభ్రంగా శుభ్రం చేసుకోవాలన్నారు.

జలుబు, దగ్గు, గొంతు నొప్పి, జ్వరం లక్షణాలు ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలి అన్నారు. ఉపాధి హామీ పథకం వేతనదారులు పనిచేసిన ప్రదేశాలలో, గ్రామాలలో, గోడ ప్రతులు, ఫ్లెక్సీలు అతికించాలి అని ఏపీఓ పవన్‌కు ఆదేశాలు జారీ చేశారు.

# ఈనెల 31 వరకూ కాండ్రకోట జాతర మరియు దర్శనం రద్దు





**- ఈవో ఏవి దుర్గా భవాని**

పెద్దాపురం : తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలో వేంచేసియున్న శ్రీ నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవములు ది.23.02.2020 సోమవారం నుండి ప్రారంభమవుతున్న సంగతి భక్తులకు విదితమే.కానీ కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలలో భాగంగా భక్తులకు శ్రీ అమ్మవారి ఆలయ ప్రవేశం మరియు దర్శనం మార్చి 31 వరకూ నిలుపుదల చేసినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఏవి దుర్గాభవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అమ్మవారికి చెల్లించే ముడుపులు, మొక్కుబడులు మార్చి 31 తర్వాత రోజులకు వాయిదా వేసుకోవలసినదిగా ఈవో తెలియ జేసారు. నూకాలమ్మ అమ్మవారికి జరుగు నిత్య పూజా కార్యక్రమములు, ధూప దీప నైవేద్యములు యధావిధిగా కొనసాగుతాయని తెలిపారు.ప్రస్తుతం నెలకొన్న అసాధారణ పరిస్థితుల దృష్ట్యా కరోనా వ్యాధి నివారణకు భక్తులందరూ సహకరించవలసినదిగా ఈవో కోరారు.

పెద్దాపురం మండలం కాండ్ర కోట కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు మేరకు కరోనా వ్యాధి నివారణ కై భక్తులు ఆరోగ్య భద్రత రీత్యా ఈ నెల 23 నుండి జరగవలసిన కాండ్రకోట శ్రీ నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు 31 వ తేదీ వరకు వాయిదా వెయ్యడం జరిగినది మరియు భక్తుల దర్శనం నిషేధించడం జరిగినది.

అమ్మవారికి జరగవలసిన నిత్య పూజ కార్యకమాలు ధూప దీప నైవేద్యాలు యధావిధిగా జరుగుతాయి.

# పరిశుభ్రతే పరమౌషధం

**- కరోనా వైరస్ పై ఆందోళన చెందవద్దు - వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలి**

**- మండల వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు**





దేవరాపల్లి : కరోనా వైరస్ వ్యాప్తిని కట్టడి చేయడానికి పరిశుభ్రతను పాటించాలని ప్రజలు భయాందోళన చెందాల్సిన పని లేదని తహశీల్దార్ జె. రమేష్ బాబు అన్నారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా చేసుకుని వ్యక్తిగత పరిశుభ్రత తో కరోనా వైరస్ తరిమి కొట్టవచ్చునని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికే వీఆర్వోలను తమ తమ గ్రామాలలో కరోనా వైరస్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ఈ నెల 25న నూతన ఉగాది దినాన్ని పురస్కరించుకొని కొత్త అమావాస్య పండగలను నిర్వహించరాదని తెలిపారు.

**సిపిఎం కరోనా వైరస్ పై కరపత్రాలు పంపిణీ:**

ప్రతి ఒక్కరిలో కరోనా వైరస్ పై అవగాహన కల్పించేందుకు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డి. వెంకన్న శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిశుభ్రతను పాటిద్దాం కరోనా వ్యాధిని అరికడదాం, కరోనా విషయంలో భయాందోళనలు వద్దు, వ్యాధి లక్షణాలు, ఈ వ్యాధి ఎలా సోకుతుంది,

కరోనా నివారణ మార్గాలు, వైద్యరంగం ప్రభుత్వం ఆధీనంలోనే ఉండాలి, మొదలగు అంశాలను ఈ కరపత్రం ద్వారా తెలియపరచారు.

# సత్యదేవుని సన్నిధిలో ఘనంగా కరోనా వైరస్ నివారణార్థం హెూమాలు



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం నందు శుక్రవారం కరోన వైరస్ నివారణార్థం దేవస్థానం ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి.సత్యనారాయణ ఆధ్వర్యంలో...

వేద పండితులు, అర్చకులు, ఋత్వికులచే నవగ్రహ హెూమము,నక్షత్ర హెూమం, ధన్వంతరి హెూమం, మన్యు సూక్త హెూమము, ఆయుష్య సూక్త హెూమము, అపమృత్యు హెూమము క్రిమిఘ్న హెూమము, క్రిమి సంహార సూక్తి హెూమ ములు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమములో...

దేవస్థానం కార్యనిర్వ హణాధికారి వి.త్రినాధరావు, ఏఈవో ప్రసాద్, సూపరింటెండెంట్ అనకాపల్లి ప్రసాద్, లక్ష్మణస్వామి, ఆలయ పర్య వేక్షణ అధికారి పోల్నాటి లక్ష్మీనారాయణ మరియు ఆలయ అధికారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా కేంద్రానికి టీవీ అందజేత

గొలుగొండ : రైతు భరోసా కేంద్రాలకు రైతుల సౌలభ్యం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన టివీలను రెండు కేంద్రాల్లో శుక్రవారం అమర్చారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మధుసూధనరావు మాట్లాడుతూ మండలంలో మూడు దశలలో 12 రైతు భరోసా కేంద్రాలను సిద్ధం చేస్తున్నామన్నారు. మొదటి దశలో సిద్ధం చేసిన ఐదు రైతు భరోసా కేంద్రాలకుగాను గొలుగొండ, చీడిగుమ్మల కేంద్రాలకు శుక్రవారం టీవీలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. మిగిలిన మూడు కేంద్రాలు కూడా రెండు మూడు రోజుల్లో టీవీలను ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ శాఖ సమాచారం అంతా టీవీల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎస్ఎ లతీఫ్, తదితరులు పాల్గొన్నారు.



చీడిగుమ్మల రైతు భరోసా కేంద్రం వద్ద అమర్చుకున్న టివి

# కోవిడ్-19 మహమ్మారి వైరస్ వ్యాప్తిని అరికట్టుటకు తగు జాగ్రత్తలు

పెద్దాపురం : (ఆంధ్ర ప్రదేశ్ పురపాలక సంఘాల చట్టం నందలి సెక్షన్ 263, 375, 336 మరియు ఆంధ్రప్రదేశ్ వల్లర్ హెల్త్ యార్డ్ 1931 నందలి వరిచ్ఛేదములను తర్వతి వైపరీత్యాల నిర్వహణ రూల్మ 2005 అందలి సెక్షన్ 54 అనుసరించి జారి చేయబడిన) నోటీసు పెద్దాపురం పురపాలక సంఘ పరిధిలో గల అన్ని వ్యాపార సంస్థలు, ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు సంస్థలు, సినిమా థియేటర్లు, కళ్యాణ మండపములు మరియు ఇండస్ట్రీస్ వారికి తెలియజేయునది ఏమనగా కోవిడ్-19 అనే వైరస్ మహమ్మారి చైనా యూహాస్ పట్టణంలో మొదలై ఇప్పుడు ప్రపంచంలోని అన్ని దేశాలలో వ్యాప్తి చెంది ప్రజారోగ్యంకి విపత్తి కలిగించుటయేగాక దాని వలన మరణాలు కూడా సంభవిస్తున్నాయి. కోవిడ్-19 వైరస్ యొక్క ముఖ్య లక్షణాలు జలుబు, దగ్గు, ముక్కు నుండి నీరు కారడం, జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడడమే కాకా సదర వైరస్ కారణముగా నిమోనియా మరియు మూత్ర పిండాలు పనిచేయక పోవడంతో బాటుగా మరణం కూడా సంభవించవచ్చు. కోవిడ్-19 మహమ్మారి వైరస్ దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రములలో కూడా హై అలర్ట్ ప్రకటించడం జరిగినది. కోవిడ్-19 మహమ్మారి వైరస్ ప్రభావంతో ప్రజారోగ్యంకు విపుత్తు ఏర్పడే అవకాశం ఉన్నందున ఇప్పటికే చాలా రాష్ట్రాలలో ప్రజలు పెద్ద ఎత్తున గుమ్మిగూడి పబ్లిక్ ప్లేసెస్ అయిన సినిమా హాల్స్, మాల్స్ మూసివేయడం జరిగినది. ఆంధ్రప్రదేశ్ లో కూడా కోవిడ్-19 మహమ్మారి వైరస్ వ్యాప్తిని అరికట్టుటకు పాఠశాలలు, కళాశాలలు సెలవులు ప్రకటించడం జరిగినది.

కోవిడ్-19 మహమ్మారి వైరస్ (కరోనా వైరస్) వ్యాప్తి చెందకుండగా తరచూ చేతులు సబ్బుతో శుభ్రపరచుకోవడం, దగ్గినపుడు, తుమ్మినపుడు చేతి రూమాలు లేదా పేపర్ నేప్కినను నోటికి అడ్డుగా పెట్టుకోవడం, వ్యక్తిగతమైన పరిశుభ్రత పాటించడమే కాకుండా సినిమా హాల్స్, ఫంక్షన్ హాల్స్, షాపింగ్ మాల్స్ మొదలగు జనం గుమ్మిగూడే పబ్లిక్ ప్లేసెస్లో కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించుటకుగాను పబ్లిక్ తాకిన తలుపులు, తలుపుల హ్యాండిల్స్, సీట్ హ్యాండిల్స్ మరియు కామన్ ప్లేసెస్ అన్ని కూడా డిస్ ఇన్ఫెక్టెంట్స్ ఎప్పటికప్పుడు పరిశభ్రపరచాలి. టాయిలెట్స్ను పరిశుభ్రంగా ఉంచవలెను. కరోనా వైరస్ నిరోధించుటకు ప్రజలు పాటించవలసిన జాగ్రత్తలను డిస్ప్లే బోర్డులు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి. పబ్లిక్ ప్లేసెస్లో చేతులు శుభ్రపరచుకునే నిమిత్తం లిక్విడ్ సోపను అందుబాటులో ఉంచాలి. ప్రజలు సదరు పబ్లిక్ ప్లేసెస్లో ఒకేసారి గుమిగూడకుండా తగు జాగ్రత్తలు వహించాలి. కావున అన్ని వ్యాపార సంస్థలు, సినిమా థియేటర్లు, హెూటల్స్, కళ్యాణ మండపములు, షాపింగ్ మాల్స్, గవర్నమెంట్ & ప్రైవేట్ కార్యాలయములు, దేవాలయములు (చర్చిలు, మసీదులు, హిందు దేవాలయములు), అపార్ట్మెంట్స్, ప్రైవేటు స్కూల్స్ & కాలేజీలు, ప్రైవేటు ఆసుపత్రులు, ఫ్యాక్టరీలు, ప్రైవేటు మీసేవా సెంటర్లు వారు పైన తెలియజేసిన జాగ్రత్తలను తీసుకొనుటయేగాక ప్రజలు పాటించవలసిన జాగ్రత్తలను డిస్ప్లే బోర్డులు వెంటనే ఏర్పాటు చేసి కరోనా వైరస్ వ్యాప్తి నిరోధించుటకు తోడ్పడవలసినదిగా తెలియజేయడమైనది. ఇందు ఎటువంటి నిర్లక్ష్య వైఖరి అవలంభించిన ఎడల మీ యొక్క లైసెన్స్ రద్దుపరచి, భవన ప్రాంగణమును సీజ్ చేసి, మీపై ప్రజారోగ్య చట్టం నందలి పరిచ్ఛేదములను, భారతీయ శిక్షా స్మృతి ప్రకారం చట్ట రీత్యా చర్య తీసుకొనుటయేగాక తగు శిక్ష విధించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

అదే విధంగా భారత ప్రభుత్వ ఆదేశముల ప్రకారం ది. 22.03.2020న ఉదయం గం.ఎ 7-00 ల నుండి రాత్రి గం.ఎ 9-00 వరకు జనతా కర్ఫ్యూ విధించియునందున స్వచ్ఛందంగా మీ యొక్క వ్యాపార సంస్థలను మూసివేయవలసినదిగా ఇందు మూలముగా తెలియజేయడమైనది.

# కరోనా వైరస్ సోకకుండా పోరాడదాం - కరెళ్ళ



తుని : తూ.గో.జిల్లా ఇటీవల ప్రపంచ దేశాలను సైతం గడగడలాడిస్తు మహమ్మారి రోగం కరోనా వైరస్ పె ప్రాథమిక వైద్య సంఘాల సమాఖ్య సంఘం రాష్ట్ర కార్యదర్శి కరెళ్ళ గణపతిరావు మాట్లాడుతూ ఆర్ఎంపి, పిఎంపి తరహ గ్రామీణ వైద్యులు ఒక్కసారి మన చరిత్రలోకి వెళితే గ్రామీణ,పట్టణ మురివాడల్లో అనేక దశాబ్దాలుగా అనుభవ పూర్వక ప్రాథమిక వైద్య సేవలు అందిస్తూ,సామాజిక ద ృక్పథంతో సేవే ధ్యేయంగా కలరా, మశూచి,డెంగ్యూ, చికిన్ గున్యా,స్వైన్‌ఫ్లూ వంటి అనేక అంటు వ్యాధులు దేశవ్యాప్తంగా ప్రబలినప్పుడు వెనుకంజ వేయకుండా గ్రామీణ వైద్యులు ప్రాణాలను సైతం అడ్డుపెట్టి ప్రాథమిక వైద్యసేవలు అందిస్తున్నారు. అనేకమంది ప్రాణాలను కాపాడుతున్నారు. అదే స్ఫూర్తితో ప్రభుత్వ ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాలు కుటుంబ నియంత్రణ,ఎయిడ్స్ నిరోధక, పల్స్ పోలియో వంటి వ్యాధి నిరోధక మైన అనేక కార్యక్రమాలలో ఏ విధమైన లాభాపేక్షలేకుండా సేవలు అందింస్తున్నారు. కాని నేడు ప్రపంచాన్ని సైతం గడగడలాడిస్తున్న కరోనా వైరస్ పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేస్తూ ఒక బాధ్యత కలిగిన పౌరులు గా సేవలు అందిస్తున్నారు.ఈ కరోనా వైరస్ కు బయపడుతున్న సమయంలో ప్రాణాలను కుడా లెక్కచేయకుండా రోగులకు సేవలు అందిస్తున్న ఎందరో మహానుభావులు లేక పోలేదు. అందులో భాగంగానే అనుభవ వైద్య నిపుణులు, డాక్టర్లు,నర్సులు, పారామెడికల్ సిబ్బంది,అదే విధంగా ప్రాణాలపై తీపి లేకుండా కుటుంబం ఏమైపోయినా పర్వాలేదు,దేశరక్షణకు సరిహద్దులో సైనికులు దేశాన్ని ఎలా కాపాడుతున్నారో అదే విధంగా దేశం లోపల రోగులను రక్షంచడమే ధ్యేయంగా వ్యాధినిరోధక సైనికులుగా సేవలు అందిస్తున్న ఆర్ఎంపి,పిఎంపి తరహా ప్రాథమిక వైద్య సోదర, సోదరీమణులకు పిలునిస్తున్నాను.ప్రతీ సభ్యుడు తగిన వ్యక్తి గత జాగ్రత్తలు తీసుకొని కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి మన వంతు క ృషి చెయ్యాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా గ్రామీణ,పట్టణ ప్రాంతాలలో కరోనా వైరస్ పై అవగాహన కల్పిస్తున్న ప్రతీ గ్రామీణ వైద్య సోదర సోదరి మనులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# అమ్మవారి జాతరకు భక్తుల దర్శనములకు రావద్దు

**ఆలయ ఈవో కీర్తి శ్రీనివాసరావు**



భీమునిపట్నం : భీమిలి గ్రామ దేవత శ్రీ శ్రీశ్రీ నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవములు ఈనెల 22 నుంచి 25 వరకు అత్యంత వైభవంగా జరగ వలసి ఉన్నది కానీ ప్రపంచవ్యాప్తంగా వణికిస్తున్న కరోనా వైరస్ ప్రభావాన్ని అరికట్టడం కోసం ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉన్నతాధి కారుల ఆదేశములను అనుసరించి అమ్మవారి జాతరకు భక్తుల దర్శనములను నిలుపు చేయడ మైనది. ఆలయ ఈవో కీర్తి శ్రీనివాసరావు తెలియజేశారు.

కావున శ్రీ అమ్మవారి భక్తులు దేవాల యంకు రాకుండా దేవస్థానం వారితో సహకరించవలసిందిగా కోరారు ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు ఈనెల 31 వరకు దర్శనాలకు అనుమతించబడదని తెలిపారు. అమ్మవారికి జరగవలసిన నిర్ణీత పూజలను పూజారులు శాస్త్రోక్తంగా ఆనవాయితీ ప్రకారం నిర్వహించదరని కానీ భక్తులను అనుమతించ పడదని తెలిపారు.ఈ సమావేశంలో ఆలయ పూజారులు చౌదరి సత్యరాజు, వెంకటేష్, ఆలయ గుమస్తా రాజు తదితరులు పాల్గొన్నారు.

# కరోనా వైరస్‌పై అవగాహన



ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

కోటవురట్ల : ప్రపంచవ్యాప్తంగా విజృంభిస్తున్న కరోనా వైరస్ భారతదేశంలో అరికట్టేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిపిఎం నేతృత్వంలో కరపత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. కొడవటిపూడిలో సిపిఎం నాయకులు పెంటకోట వెంకటస్వామి, టిడిపి నాయకులు యలమంచిలి వీరవెంకట సూర్యప్రకాష్, వైసిపి నాయకులు పారుపల్లి త్రినాథ్‌ల సమక్షంలో పంపిణీ చేశారు. అనంతరం వెంకటస్వామి మాట్లాడుతూ కరోనా వైరస్ అనే వ్యాధి మొదట చైనా దేశంలో వ్యాధిగా పుట్టి నేడు ప్రపంచ వ్యాప్తంగా వైరస్ మారి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో భారతదేశంలో దేశవ్యాప్తంగా విడుదల చేసిన కరపత్రాలు నేడు మనందరి సమక్షంలో పంపిణీ చేసిన కరపత్రాలు ప్రతీ ఒక్కరూ చదివి కరోనా వైరస్ అరికట్టడానికి అందరూ సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రగాడ గోవింద్, అన్నం రాంబాబు, కొక్కుపూడి రమణ, గంటా గోవింద్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 22న జరుగు కర్ఫ్యూకు సంపూర్ణ మద్దతు

నాతవరంః ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 22న ఆదివారం పిలుపునిచ్చిన జనతా కర్ఫ్యూకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని నాతవరం వర్తక సంఘం అధ్యక్షులు తూతిక నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9గంటలకు కర్ఫ్యూ జరుగు తుందన్నారు. కావున నాతవరంలో ఎటువంటి షాపులు, హోటళ్లు తెరవడం జరగదన్నారు.

# కరోనా వల్ల ప్రజలు భయబ్రాంతులకు గురికావద్దు

కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో కరోన వైరస్ వల్ల ప్రజలు బయబ్రాంతుల గురికాకుండా కరోన వైరస్ ప్రబలకుండ ముందస్తు జాగ్రత్త లు చెప్పట్టుట జరుగుచున్నవి. ఇందుకు గాను అత్యవసరం గా ప్రజలకు అందుబాటులో కాకినాడ నగర పాలక సంస్థ చేత 2- రాపిడ్ రెస్పోండ్ టీం లు ఏర్పాటు చేయుట జరిగినది. మరియు కోవిడ్-19 వ్యాప్తి చెడకుండా సహాయం కొరకు 24గంటలు కాల్ సెంటర్.నెం. 0884-2357722 ఏర్పాటు చేయుట జరిగినది. ప్రజలు ఎక్కువుగా తిరుగు ప్రదేశములలో వ్యాది వ్యాప్తి చెందుటకు అవకాశము ఎక్కువగా ఉన్నందున అటువంటి ప్రదేశములలో తిరగకుండా వ్యాది వ్యాప్తి నిరోదించవలసిందిగా భారత దేశ పౌరుడిగా మరియు రాష్ట్రపౌరుడిగా మీ పట్ల మీ కుటుంబ సభ్యుల పట్ల మరియు సమాజం పట్ల మీ భాద్యత వహించవలసిన తెలియచేయదమైనది. గౌ ప్రధాన మంత్రి వారి సూచనల మేరకు ది.22-03-2020 ఆదివారం ఒక్కరోజు అన్నీ వ్యాపార సంస్థలు , మార్కెట్స్ పూర్తిగా మూసివేయబడును కావున ప్రజలందరికి కావలసిన నిత్యవసర సరుకులు ముందుగా ఏర్పాటు చేసుకోవలసినదిగా తెలియచేయుచు మరియు కాకినాడ నగర పరిధిలో గల అన్నీ ఫంక్షన్ హల్స్/ జిమ్/ సినిమా హల్స్/ హోటల్స్/ రెస్టారెంట్స్/బేకరీ లు / బ్యాంకు లు/సూపర్ మార్కెట్ లు/ బస్ స్టాండ్ లు/ రైల్వే స్టేషన్/ షాపింగ్ మాల్స్ నకు కోవిడ్-19 వైరస్ వ్యాప్తి అరికట్టుటకు ముందస్తు జాగ్రత్త గా నోటీసులు జారీ చేయుట జరిగినవి.

## కరోనా : ఈ వాట్సాప్ నంబరు సేవ్ చేసుకోండి!

న్యూఢిల్లీ: కరోనా వైరస్ దేశంలో విజ ృంభిస్తున్న తరుణంలో కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా ప్రజలకు ఈ వైరస్‌పై అవగాహన కల్పించే చర్యల్లో భాగంగా ప్రముఖ ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ వాట్సాప్‌లో అధికారిక వాట్సాప్ చాట్‌బాట్‌ను ప్రారంభించింది. వాట్సాప్‌లో తప్పుడు సమాచారం, నకిలీ వార్తలకు చెక్ పెట్టే లక్ష్యంతో మై గోవ్ కరోనా హెల్ప్‌డెస్క్ పేరుతో దీన్ని లాంచ్ చేసింది. ఇది వినియోగదారులందరికీ అందుబాటులో ఉంటుంది. ఫేస్‌బుక్, ఇతర సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లపై ఫేక్ న్యూస్‌ను గుర్తించేందుకు, కోవిడ్-19 పై సమస్యలను పరిష్కరించుకోవాలని కోరుతోంది. ఇందుకోసం వాట్సాప్ నెంబర్ 9013151515ను లాంచ్ చేసింది. ఈ నేపథ్యంలోనే నేషనల్ ఫార్మాస్యూటికల్స్ ప్రైసింగ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌పీపీఏ) ట్విటర్‌లో దీన్ని ప్రకటించింది. కరోనా వైరస్‌కు సంబంధించి అందోళన చెందవద్దనీ, వాట్సాప్ నెంబర్‌లో ప్రజల సందేహాలకు, ప్రశ్నలకు ఆటోమెటిక్ గా సమాధానం లభిస్తుందని ఎన్‌పీపీఏ ట్వీట్ చేసింది.

# కరోనాకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ రాంబాబు



భీమునిపట్నం : కరోనా వైరస్ ప్రభావం ఉండం వలన ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని ఎస్.ఐ రాంబాబు, ప్రసాద్ లు చెప్పారు.బీచ్ కు వచ్చిన సందర్శకులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ కరోనా వ్యాధి వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ అన్నారు. అదేవిధంగా జనసమూహం ఉన్న ప్రదేశాల్లో ఎక్కువగా ఉండకూడదని తెలిపారు. ఎక్కువగా బయట సంచరించరాదనీ, ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లవలసివస్తే మాస్కులు ధరించాలనీ అన్నారు. అరగంటకు,అరగంటకు చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కొని ఉండాలనీ చెప్పారు. సాధ్యమైనంత వరకూ ఇంట్లో ఉండేవిధంగా చూసుకోవాలని తెలిపారు.

## సింగపూర్‌లో చిక్కుకున్న జడ్చర్ల విద్యార్థులు



జడ్చర్ల: కరోనా వైరస్ కారణంగా సింగపూర్‌లోని చంగీ ఎయిర్‌పోర్టులో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన ఆరుగురు వైద్య విద్యార్థులు చిక్కుకుపోయారు. బుధవారం భారత్ వస్తుండగా చివరి నిమిషంలో అధికారులు వీరి ప్రయాణాన్ని అడ్డుకున్నారు. ఫిలిప్పీన్స్‌లో వైద్య విద్యనభ్యసిస్తున్న వీరిని 72 గంటల్లోగా తమ స్వస్థలాలకు వెళ్లిపోవాలని అక్కడి ప్రభుత్వం ఆదేశించింది. దీంతో విద్యార్థులు ముందు సింగపూర్ చేరుకున్నారని, తర్వాత ఇక్కడికి రావడానికి విమానం ఎక్కే చివరి నిమిషంలో ప్రయాణం నిలిపివేయాలని భారత్ నుంచి అధికారులు అక్కడి ఎయిర్‌పోర్టు అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఈ పరిస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు గురువా రం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తమ పిల్లలను రప్పించాలని కోరారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలసి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. విద్యార్థులను క్షేమంగా జడ్చర్లకు తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## 'సినీ కార్మికుల కోసం స్టార్లు కదలాలి'

ముంబై : కరోనా మహమ్మారి సినీ పరిశ్రమపై పెనుప్రభావం చూపుతోంది. సినిమా షూటింగ్‌లు, రిలీజ్‌లు నిలిచిపోవడంతో పాటు థియేటర్లు మూతపడటం బాలీవుడ్‌కు తీవ్ర నష్టాలను మిగిల్చింది. ఇటీవల విడుదలైన భాగీ 3, అంగ్రేజి మీడియం వంటి సినిమాలు నష్టాలను మూటగట్టుకున్నాయి. ఈనెల 31న థియేటర్లను తిరిగి తెరిచిన తర్వాత ఆయా సినిమాలను రీ రిలీజ్ చేసేందుకు నిర్మాతలు ప్రయత్నిస్తున్నారు. కరోనా వ్యాప్తిని కట్టడి చేసేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలతో వినోద పరిశ్రమ ఈ నిర్ణయాలు తీసుకున్నా దినసరి కార్మికుల పరిస్థితిపై మాత్రం సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఫ్లడ్‌లైట్ల వెలుతురులోనే కడుపు నింపుకునే సినీ కార్మికులకు ఇప్పుడు పూట గడవని పరిస్థితి. సినీ పరిశ్రమలో దినసరి వేతనంతో పనిచేసే కార్మికులను ఆదుకునేందుకు సంక్షేమ నిధిని భారత నిర్మాతల మండలి ఏర్పాటు చేసినా కార్మికులకు తిరిగి పని దొరికేవరకూ వారికి కొంత డబ్బును అందించేందుకు దర్శక నిర్మాతలు ముందుకు రావాలని సినీ విశ్లేషకులు తరణ్ ఆదర్శ్ కోరారు.

# తుని సంఘటనలో కాపు యువ నాయకులుపై కేసులు ఎత్తివేతపై హర్షం

అమలాపురం: కాపు రిజర్వేషన్ ఉద్యమం సమయంలో తునిలో జరిగిన విధ్వంసంపై కాపు యువత నాయకులపై అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ముఖ్యమంత్రి జగన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం బేషరతుగా కేసులు ఎత్తివేసిన సందర్భంగా ఆయనకు కృతజ్ఞత తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు . అమలాపురం పట్టణ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాపు నాయకులు ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన సమావేశంలో 13 జిల్లాల్లో జరిగిన అక్రమ కేసులు కూడా ఎత్తి వేస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో కర్రి రాఘవులు, గనిశెట్టి రమణ్‌లాల్,సుంకర సుధ, బెజవాడ సత్తిబాబు, ఒంటెద్దు వెంకన్నాయుడు, మామిడిపల్లి శ్రీను, తోట శ్రీను, నల్లా ప్రసాద్, కురసాల బద్దాజీ, కైరం తాతాలు, చిక్కాల రవిశంకర్, మద్దింశెట్టి ప్రసాద్, సుంకర ఫణి, బోనం అప్పారావు, కల్వకొలను ఉమ, తిక్కిరెడ్డి వెంకటేష్, నల్లా అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## జాగ్రత్తలు వహించడం ద్వారా కరోనా నుండి విముక్తి

**- ఎస్‌బిఐ సిబ్బందికి శానిట్‌జర్, మాస్కలను పంపిణీ చేసిన ఆర్‌ఎం వేమూరి**



అమలాపురం: ప్రపంచ దేశాలను గడగడలాడిస్తున్న కరోనా వైరస్‌ను పలు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కరోనా బారిన పడకుండా ఉండొచ్చని అమలాపురం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ వేమూరి నరసింహమూర్తి అన్నారు.

స్థానిక మెయిన్ బ్రాంచ్‌లో చీఫ్ మేనేజర్ ఎవివిఎస్ ప్రకాషరావు ఆధ్వర్యంలో ఎస్‌బిఐ సిబ్బందికి శానిట్‌జర్, మాస్కలను ఆర్‌ఎం వేమూరి చేతులుమీదుగా శుక్రవారం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వైరస్ పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దగ్గిన, తుమ్మిన వారి వద్ద నుండి దూరంగా ఉండాలని, తరచూ చేతులు శుభ్రపరుచుకోవాలని ఆయన తెలిపారు. సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పుడు జాగ్రత్తలు వహించాలని, లేకుంటే కుటుంబాలు నాశనం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కరోనా వైరస్ అరికట్టే దిశగా జిల్లా యంత్రాంగం మరిన్ని చర్యలు

**జిల్లా కలెక్టర్ జె.నివాస్**



శ్రీకాకుళం: జిల్లాలో కరోనా వైరస్ ( కోవిడ్ 19 ) అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం మరిన్ని చర్యలను చేపట్టిందని జిల్లా కలెక్టర్ జె.నివాస్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థలతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కరోనా వైరస్ వ్యాపించకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఇప్పటికే సినిమా హాళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, విద్యాసంస్థలను మూసివేసినట్లు చెప్పారు. ఇవేకాకుండా బస్సులలో ప్రయాణీకుల సీట్లను ఎప్పటికపుడు శుభ్రపరచాలని ఆదేశించడం జరిగిందన్నారు. వీటితో పాటు ఇతర దేశాల నుండి స్వస్థాలలకు వచ్చిన వారిలో అనుమానస్పదంగా ఉన్న 262 మందిని గుర్తించి వారిని స్వీయ గృహ నిర్బంధంలో ఉంచడం జరిగిందన్నారు.

వీరికి నిత్యావసర వస్తువుల సరఫరాకు వ్యూహం చేస్తున్నామని, ఇందుకు స్వచ్ఛంధ సంస్థలు సహకరించాలని కోరారు. దాతలు అందించే సహాయంతో శనివారం నుండే నిత్యావసర సరుకులను పంపిణీ చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసామని చెప్పారు. ఇందుకు రూ.2.50 లక్షలు నిధులు అవసరమని గుర్తించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో రెడ్ క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జగన్మోహన్ రావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు దుప్పల వెంకట రావు, దానేటి శ్రీధర్, నటుకుల మోహన్, ఎం.ప్రసాద రావు, రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పేదల భూములు ల్యాండ్ పూలింగ్ పేరు చెప్పి బలవంతంగా తీసుకోవడాన్ని వెంటనే నిలుపుదల చేయాలి

## - ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న



సబ్బవరం : పేదల భూములను ల్యాండ్ పూలింగ్ పేరు చెప్పి బలవంతంగా తీసుకోవడాన్ని వెంటనే నిలుపుదల చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న, మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఉప్పాడ సత్యవతి డిమాండ్ చేశారు మండల కేంద్రంలోని శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ విశాఖ జిల్లాలోని 10 అర్బన్ మండలాలలో 52 గ్రామాల్లో ప్రభుత్వ ల్యాండ్ పోలింగ్ పేరు చెప్పి జీవో నెంబర్ 72 తీసుకువచ్చి 6166 ఎకరాలు పేదలు , దళితులు , సన్న చిన్నకారు లు గిరిజనులు భూములను ప్రభుత్వం బలవంతంగా తీసుకుంటున్నారని డిమాండ్ చేశారు . 10 మండలాలకు చెందిన రైతులు ల్యాండ్ పూలింగ్ బాధితులు హైకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు రైతుల నుండి బలవంతంగా భూములు తీసుకోవద్దని చెట్లను తొలగించే అధికారం ఎవరికీ లేదని హైకోర్టు స్టే ఇచ్చిందని తెలిపారు. భూ సేకరణ చట్టం అమలు చేయకుండా ల్యాండ్ పూలింగ్ కు జీవో ని తీసుకువచ్చి ఎలా తీసుకుంటున్నారని వెంటనే 23వ తేదీలోగా ప్రభుత్వం సమాధానం తెలుపుతూ కౌంటర్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు భూములు తీసుకోలేదంటూ ఫారం 3 దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు ప్రభుత్వం పునః పరిశీలన చేసుకుని వెంటనే ల్యాండ్ పూలింగ్ నిలుపుదల చేయాలని బలవంతంగా భూములు తీసుకోవాలని చూస్తే అధికారులు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు పేదల పట్ల జూలం తగ్గించుకుని వెంటనే హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం పేదల దగ్గర తీసుకున్న భూములు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం మండల నాయకులు కే. కోటేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్‌బాల్ దిగ్గజం కన్నుమూత.. సచిన్ సంతాపం



కోల్‌కతా: భారత ఫుట్‌బాల్ దిగ్గజం, మాజీ సారథి ప్రదీప్ కుమార్ బెనర్జీ (83) కన్నుమూశారు. గత కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన శుక్రవారం కోల్‌కతాలో తుదిశ్వాస విడిచారు. ఆటగాడిగా భారత్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించిన బెనర్జీ.. అనంతరం కోచ్‌గా కూడా జట్టుకు తన సేవలను అందించారు. 1936లో జన్మించిన బెనర్జీ భారత్ తరుపున 84 మ్యాచ్‌లకు ప్రాతినిథ్యం వహించి 65 గోల్స్ సాధించారు. 1962లో జకార్తాలో జరిగిన ఆసియా గేమ్స్‌లో భారత్ స్వర్ణం గెలవడంలో బెనర్జీ కీలక పాత్ర పోషించారు. అంతేకాకుండా 1960లో జరిగిన రోమ్ ఒలింపిక్స్‌లో ఫ్రెంచ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ తరుపును ఏకైక గోల్ సాధించి మ్యాచ్‌ను డ్రా చేసేందుకు సహాయపడ్డారు. ఇక రోమ్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత జట్టుకు పీకే బెనర్జీనే సారథిగా వ్యవహరించిన విషయం తెలిసిందే. పీకే బెనర్జీ మరణం యావత్ క్రీడా ప్రపంచాన్ని విషాదంలో ముంచెత్తింది. ఈ దిగ్గజ ప్లేయర్ మృతి పట్ల భారత మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆయనతో తనకున్న జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆయనతో దిగిన ఫొటోను సచిన్ తన ట్విటర్‌లో పోస్ట్ చేశారు. పీకే బెనర్జీకి ఇద్దరు కుమార్తెలు. ఆయన తమ్ముడు ప్రసూన్ బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీగా ఉన్నారు.

# మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్ రాజీనామా

## బలపరీక్షకు ముందే కమల్ రాజీనామా
## బీజేపీపై తీవ్ర విమర్శలు

భోపాల్ : మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ తన పదవికి రాజీనామా చేశారు. శుక్రవారం సాయంత్రం నాటికి అసెంబ్లీలో బలపరీక్ష నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్‌కు చెందిన 22 మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి.. రాజీనామాలు చేయడంతో కమల్‌నాథ్ సర్కార్ మైనార్టీలో పడిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో సరిపడ బలం లేకపోవడంతో శుక్రవారం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ లాల్జీ టాండన్‌ను కలిసి తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. కాంగ్రెస్‌కు చెందిన కీలక నేత జ్యోతిరాదిత్య సింధియా కాషాయ దళంలో చేరడంతో కమల్‌నాథ్ ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. కాగా సీఎంగా ప్రమాణం చేసిన 15 నెలల్లోనే ఆయన రాజీనామా చేయడం గమనార్హం. గత నెల రోజులుగా సాగుతున్న రాజకీయ సంక్షోభానికి ముగింపు పలకే విధంగా గురువారం సాయంత్రం సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వంపై ఎమ్మెల్యేలకు విశ్వాసం లేదన్న పిటిషన్‌పై విచారణ సందర్భంగా.. వెంటనే సభలో విశ్వాసాన్ని నిరూపించుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. రాష్ట్రంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులను చక్కదిద్దేందుకు సభలో విశ్వాస పరీక్ష జరపాలని జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ హేమంత్ గుప్తాల ధర్మాసనం సభాపతిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం కమల్‌నాథ్ మీడియా సమావేశం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గడిచిన 15 నెలల్లో రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, అయినా తమ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీజేపీ కుట్రలు పన్నిందన్నారు. తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను కర్ణాటకలో బంధించారని ఆరోపించారు.

ఐదేళ్ల పాటు పరిపాలన చేయాలని ప్రజలకు తమకు అధికారం కట్టబెట్టారని, కానీ తనకు వ్యతిరేకంగా బీజేపీ కుట్రచేసిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కూనీ చేసే విధంగా బీజేపీ నాయకులు తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారని మండిపడ్డారు.

# నగరంలో హై అలర్ట్..

## కరోనా పాజిటివ్ కేసు నమోదుతో అధికారులు అప్రమత్తం
## ఈ ప్రాంతానికి రాకపోకలు నిలిపివేసిన పోలీసు అధికారులు









విశాఖ సిటీ : ప్రపంచాన్నే వణికిస్తున్న అల్లిపురంలో కరోనా వైరస్ కలకలంతో ఒక్కసారిగా ఉద్విగ్న పరిస్థితులు నెలకొన్నాయి. అల్లిపురం వివేకానంద కాలనీకి చెందిన 65 ఏళ్ల వ్యక్తి ఇటీవల కాలంలో మక్కా యాత్రకు వెళ్లి విశాఖ చేరుకున్నారు. అయితే, ఆయనకు ఆరోగ్య పరిస్థితులనుబట్టి వైద్యాధికారులను సంప్రదించగా నగరంలోని ఊపిరితిత్తులు, ఛాతీ ఆసుపత్రిలో ఈ నెల 17న చేర్పించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యాధికారులు రక్తనమూనాలను సేకరించగా కరోనా పాజిటివ్‌గా నిర్ధారించారు. దీంతో కరోనా పాజిటివ్ రిపోర్ట్‌గా నమోదు చేశారు.

ఈ విషయం బయటకు పొక్కడంతో విశాఖ వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. నగరమంతా భయానక వాతావరణం నెలకొంది. ఈ పరిణామంతో ఉత్తరాంధ్ర సైతం కంగారుపడుతోంది. కరోనా కలకలాన్ని గుర్తించిన అధికారులు తక్షణమే స్పందించి ఆ ప్రాంతం మొత్తాన్ని హై అలర్ట్ ప్రకటించారు.

విశాఖలోని ఎల్ఐసి జంక్షన్ నుండి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్లను అలాగే కంచరపాలెం మెట్టు నుండి జ్ఞానాపురం రైల్వే స్టేషన్, న్యూకాలనీ తదితర రోడ్లను మూసివేసి నిర్మానుష్యంగా తయారు చేశారు.

ఎటువంటి రాకపోకలు నిషిద్ధమంటూ పోలీసు అధికారులు హెచ్చరికలు జారీచేశారు. అయితే, అలజడి చెందాల్సిన అవసరం లేదని వైద్య వర్గాలు వెల్లడిస్తున్నాయి. జిల్లా ఆరోగ్యశాఖ ఇక్కడి డీఎంహెచ్ వో కార్యాలయంలో 24గంటలూ పనిచేసే కాల్ సెంటర్‌లో సిబ్బంది అందుబాట్లోనే ఉంటున్నారు. కరోనా పాజిటివ్ రోగి తమ అధీనంలోనే ఉన్నారని, అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని వైద్యాధికారులు తెలియజేస్తున్నారు. అయితే సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దంటూ పోలీసు అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఆందోళన చెందాల్సిన పని లేదు..
**డిఎం అండ్ హెచ్ఓ తిరుపతిరావు**

ప్రపంచ మహమ్మారి కరోనా వైరస్ విశాఖలో ప్రవే శించింది. తొలి కరోనా కేసు నమోదు అయింది. మక్కా యాత్రకు వెళ్లిన నగరానికి చెందిన అరవై అయిదేళ్ల వృద్ధుడికి కరోనా వైరస్ లక్షణాలు కనిపించాయని డీఎం అండ్ హెచ్‌వో తిరుపతిరావు తెలిపారు. నగరంలోని ఊపిరితిత్తులు, ఛాతీ ఆసుపత్రిలో ఆయనను చేర్పించగా రక్త నమూనాలు సేకరించి శాంపిల్స్ ల్యాబ్ కు పంపించగా కరోనా పాజిటివ్ వచ్చినట్లుగా తెలిసింది. అల్లిపురంలో వైరస్ సోకిన వ్యక్తి కుటుంబ సభ్యులతో పాటు ఆ ప్రాంతంలోని మూడు కిలోమీటర్ల పరిధిలో సుమారు 7050 ఇళ్లలో సర్వే చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం, వలంటీర్ల సహాయంతో 141 బృందాలను ఏర్పాటు చేసి అల్లిపురం మొత్తం నిఘా పెట్టామన్నారు. ఇంటింటా జరుగుతున్న సర్వేతో పాటు ప్రత్యేక కరోనా సర్వేలో భాగంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తిరుపతిరావు తెలిపారు. అయితే ప్రస్తుతం కరోనా రోగి పరిస్థితి ఆందోళనకరంగా లేదని, ఎవరూ అపోహలకు గురికావద్దని తెలిపారు. తగిన చికిత్స అందిస్తున్నామని డిఎం అండ్ హెచ్ఓ తిరుపతిరావు పేర్కొన్నారు.

## టీచర్స్ డైరీని ఆవిష్కరించిన స్వాతి ప్రమోటర్స్ యం.డి రమేష్ రెడ్డి



ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ టీచర్స్ అసోసియేషన్ 2020 డైరీని స్వాతి ప్రమోటర్స్ యం.డి రమేష్ రెడ్డి తమ సంస్థ ప్రధాన కార్యాలయం, బాలయ్య శాస్త్రి లేఔట్ నందు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీచర్స్ అసోసియేషన్ మెంబర్స్ తమ అసోసియేషన్‌కి సహాయ సహకారాలు అందిస్తున్న స్వాతి యం.డి రమేష్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.బి.బి రావు, ప్రిన్సిపాల్, బి.సి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ, సింహాచలం. స్టేట్ ప్రెసిడెంట్ (బిసిఆర్ఇఐటిఎ) ఎన్ .వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ బి.సి రెసిడెన్షియల్ స్కూల్, నర్సీపట్నం వైస్ ప్రెసిడెంట్ (బిసిఆర్ఇఐటిఎ) తదితరులు పాల్గొన్నారు.

## భయం వద్దు .. పరిశుభ్రత, ఆచరణ ముద్దు
**డి.ఐ.జి. ఎల్.కె.వి.రంగా రావు**



విశాఖపట్నం: ప్రజలందరికీ వినమ్రంగా తెలియజేయునది ఏమనగా కరోన వైరస్ ఎవరికి ఉందో? ఎవరికి లేదో? లాంటి లక్షణాలు బయటకు కనిపించని కారణంగా తెలిసేటువంటి అవకాశం ఉండదు కాబట్టి అందరూ కూడా సామాజిక భాద్యతతో మెలగి, మన కారణంగా ఏ ఒక్కరూ భాద పడకూడదు, ఏ ఒక్కరి ప్రాణాల మీదకు రాకూడదనే భాద్యతో ఉండి, సామాజిక దూరాన్ని పాటిస్తూ, తప్పనిసరి పరిస్థితులలో తప్ప, ప్రజా సమూహాలలోకి రాకుండా జాగ్రత వహిస్తే కొంత కాలంలో మనం ఈ కరోనో వ్యాధి నుంచి భయటపడగలము. కాబట్టి ప్రజలందరికీ నేను మనవి చేసేది ఏమనగా ఒక వ్యక్తి నుంచి మరి కొందరికి తనకు తెలియకుండా వ్యాప్తి చెందే అవకాశం ఉన్న కారణంగా కేవలం జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా, మన అలవాట్లు మార్చుకోవడం ద్వారా, పరిశుభ్రత పూర్తి స్థాయిలో పాటించడం ద్వారా, మనకు వీలైనంత వరకు ఇంటికి పరిమితం అవడం ద్వారా ఈ వ్యాధిని మనం కట్టడి చేయవచ్చు. కాబట్టి ప్రజలు ఈ విషయాన్ని గమనించి చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుని అవసరమైతే తప్పా బయటకు ప్రజాసమూహాల మద్యకు రాకుండా, దూరాన్ని పాటిస్తూ జాగ్రత్తలు పాటిస్తూ, పరిశుభ్రతను పాటిస్తూ ఉంటే ఈ వ్యాధిని నిరోధించగలం. అలాగే ఎక్కడైనా సరే అనుమానితులు కనిపించినా, విదేశాలనుంచి వచ్చి ఐసోలేషన్‌లో ఉండకుండా బయట తిరుగుతున్నట్లు మనకు తెలిసినా వెంటనే పోలీసు, ఆరోగ్య శాఖలకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

భయం వద్దు పరిశుభ్రత ఆచరణ ముద్దు. ఆ విషయాన్ని ప్రజలు గమనించి ఎట్టి పరిస్థితిలలో ఈ వ్యాధి విస్తరించకుండా, మరెవరికి కూడా రాకుండా ప్రతి ఒక్కరు నాకు రాదు నేను ఆరోగ్యంగా ఉన్నాను అని అనుకుంటారు, అయినప్పటికి కూడా వ్యాధిగ్రస్తులతో మనం మాట్లాడటం కరచాలనం, వారికి దగ్గరగా ఉండటం తద్వారా పెద్ద వాళ్ళకు లేదా చిన్న పిల్లల దగ్గరకు వెళితే ఈ వ్యాధి వ్యాప్తి చెందే అవకాసం ఉంది. మన కారణంగా మన ప్రియమైన వ్యక్తులకు ఎవరికి కూడా ఈ వ్యాధి రాకూడనే అవగాహన కలిగిఉండాలి, మన అవగాహనే దీనికి సరైనటువంటి మార్గం, సామాజిక దూరాన్ని, పరిశుభ్రతను పాటించాలి. ఇది ప్రతి ఒక్కరూ కూడా ఏ ఒక్కరూ నిర్లక్ష్యంగా ఉన్నా ఎంతో కొంత మందికి ఆతరువాత మరి కొంతమందికి వ్యాప్తి చెందే అవకాశం ఉన్న కారణంగా ఇది అంటూ వ్యాధిలా ప్రభలే అవకాశం ఉంది కాబట్టి ప్రతి ఒక్కరూ దయచేసి జాగ్రత్తలు తీసుకోవలసిందిగా మనవి చేస్తున్నామని డి.ఐ.జి. ఎల్.కె.వి.రంగా రావు తెలిపారు.

## జాగ్రత్తలు పాటిద్దాం కరోన వైరస్‌ను తరిమికొడదాం
**ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె కె రాజు**



విశాఖ సిటీః ప్రపంచ దేశాలను వణికిస్తున్న కరోన వైరస్ వ్యాప్తి చెందకుండా ప్రతీ ఒక్కరు తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె కె రాజు ఒక ప్రకటన ద్వారా తెలియజేసారు. ముఖ్యముగా ఎక్కువ జన సమూహం ఉన్న చోట తిరగకూడదని, తుమ్మేటపుడు, దగ్గేటపుడు చేతి రుమాలు లేదా మోచేతులు గాని అడ్డుపెట్టుకోవాలని, ప్రతీ ఒక్కరూ ఏదైనా తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని మీ ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రముగా ఉండేలా చూసుకోవాలని, వీలైనంత వరకు పెళ్లిల్లకు, ఫంక్షన్‌లకు వెళ్ళటం, దూరప్రయాణాలు మానుకోవాలని సూచించారు. ఎవరైనా దగ్గు, జలుబు, జ్వరం వున్నా, శ్వాస పీల్చు కోవడం ఇబ్బందిగా ఉన్న మీ దగ్గరలో గల హాస్పిటల్‌లో చూపించు కోవటం మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు.

## రైతులను భయానికి గురిచేయొద్దు
**ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు**

తాడేపల్లి: రైతుల్ని కరోనా పేరుతో భయానికి గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు హెచ్చరించారు. కరోనా సాకు చూపించి రైతుల పండించిన పంటలు, పళ్ల ధరలు తగ్గించే పని చేస్తే తీవ్రంగా చర్యలు ఉంటాయన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కరోనా ప్రభావం, దళారుల విష ప్రచారంతో రైతులు ఆందోళ చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరలకే కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు.

కరోనా ప్రభావంతో ఇతర రాష్ట్రాల్లో పెద్ద మార్కెట్లు మూసేస్తున్నారని కానీ ఏపీలో కొనుగోలు కేంద్రాలు తెరిచే ఉంటాయని భరోసా ఇచ్చారు. మార్కెట్ యార్డుల్లో రైతులకు శానిటైజర్లు, మాస్కులు అందుబాటులో ఉంటాయన్నారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి అన్ని కేంద్రాల్లో కొనుగోళ్లు ఉంటాయని తెలిపారు. క్షేత్ర స్థాయిలో 4వేల రైతు భరోసా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, మే నాటికి మరో 11 వేల రైతు భరోసా కేంద్రాలు సిద్ధం చేస్తామన్నారు.

## తిరుమలలో ధన్వంతరి మహాయాగం



తిరుమల : ప్రపంచంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఈ నెల 26 నుంచి 28 వరకు ధన్వంతరి మహాయాగం నిర్వహించనున్నట్టు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది. తిరుమలలోని ధర్మగిరి వేద పాఠశాలలో శ్రీనివాస శాంత్యోత్సవ సహిత ధన్వంతరి మహాయాగం జరపనున్నట్టు టీటీడీ అధికారులు తెలిపారు. చైనాలో పుట్టిన కరోనా వైరస్‌తో ప్రపంచం భయభ్రాంతులకు గురవుతోందన్నారు. శ్రీమహావిష్ణువు రూపాలలో సర్వ రోగాలను నయం చేసే ధన్వంతరి రూపం ఒకటని, ఈ యాగం నిర్వహించడం వల్ల మానవాళికి నష్టం కలిగించే వ్యాధులు నయమవుతాయని పేర్కొన్నారు. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపనందేంద్ర స్వామి, మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠాధిపతి సుబుదేంద్రతీర్థ స్వామి ఆధ్వర్యంలో ఈ యాగం నిర్వహిస్తామని చెప్పారు. కాగా, కరోనా వైరస్ నేపథ్యంలో తిరుమలలో భక్తుల దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు.

యథావిధిగా దుర్గగుడిలో హోమాలు..

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో శనివారం నుంచి ప్రారంభం కానున్న హోమాలు, పారాయణాలు యథావిధిగా జరుగుతాయని ఆలయ ఈవో సురేష్‌బాబు తెలిపారు. కరోనా నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నుంచి భక్తులకు అనుమతి లేదన్నారు. అమ్మవారికి నిత్య కైంకర్యాలు జరుగుతాయని చెప్పారు. దూరప్రాంతాల నుంచి వచ్చేవారు ఇందుకు సహకరించాలన్నారు. తిరిగి అమ్మవారి దర్శన తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com